# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 248 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 29 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 248 29-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## 107 రైళ్లు రద్దు

**విజయవాడ అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మొంథా తుపాను దృష్ట్యా ప్రయాణికుల భద్రత కోసం రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రద్దు చేసింది. నేడు, రేపు నడిచే 107 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇవాళ 70 రైళ్లు, రేపు 36 రైళ్లు, ఎల్లుండి ఒక రైలు రద్దు చేసినట్లు పేర్కొంది. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖ, గుంటూరు మీదుగా నడిచే పలు రైళ్లు ఇందులో ఉన్నాయి.

# మొంథా అలజడి





## అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకిన 'మొంథా' తుపాను...

కుండపోత వర్షాలతో కోస్తాంధ్ర అతలాకుతలం

- కాకినాడ-మచిలీపట్నం మధ్య తీరాన్ని తాకిన మొంథా తీవ్రతుపాను
- పూర్తిగా తీరం దాటేందుకు మరో 3 నుంచి 4 గంటల సమయం
- గంటకు 100 కిలోమీటర్ల వేగంతో భీకర గాలులు వీచే అవకాశం
- కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలకు హెచ్చరిక
- 50 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన యంత్రాంగం
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని కఠిన ఆదేశాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను తీరాన్ని తాకింది. కాకినాడ- మచిలీపట్నం మధ్య అంతర్వేదిపాలెం సమీపంలో తీరాన్ని తాకింది. పూర్తిగా తీరం దాటేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. తీరం దాటే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాల్లో భారీగా గాలులు వీస్తున్నాయి. తుపాను ప్రభావంతో కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 24 గంటల్లో తీరప్రాంతంలో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

⏭ మార్గ్ 2లో..



## సహాయక చర్యలకు
# తరలిరండి..

- మొంథా తుపానుపై ఎన్డీయే నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- నేడు, రేపు ప్రజలకు అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- ఈ రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య తీరం దాటే అవకాశం

**అమరావతి అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రంపైకి దూసుకొస్తున్న మొంథా తుపాను నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఎన్డీయే కూటమి శ్రేణులను అప్రమత్తం చేశారు. ఈరోజు ఆయన ఎన్డీయే కూటమికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

- తరువాయి 2లో..

## ఏపీలో జాతీయ రహదారులపై..
# భారీ వాహనాలు బంద్

- ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న మొంథా తీవ్ర తుఫాను
- కోస్తా జిల్లాల జాతీయ రహదారులపై భారీ వాహనాలు బంద్
- రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం
- కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమలో అత్యంత భారీ వర్షాల హెచ్చరిక

**అమరావతి అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. విపత్తు నివారణ చర్యల్లో భాగంగా కోస్తా జిల్లాల జాతీయ రహదారులపై మంగళవారం రాత్రి 7 గంటల నుంచి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. తుపాను దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) సూచించింది. మంగళవారం మధ్యాహ్నం నాటికి ఈ తుపాను గడిచిన ఆరు గంటల్లో గంటకు 10 కిలోమీటర్ల వేగంతో కదిలింది. ప్రస్తుతం మచిలీపట్నానికి

- తరువాయి 2లో..



## పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకే
# జిల్లాల పునర్ వ్యవస్థీకరణ
## మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు సమీక్ష

- అశాస్త్రీయంగా గత ప్రభుత్వ విభజన
- జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు సమీక్ష...
- సరిదిద్దాలని నిర్ణయం
- గత ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చనున్న కూటమి సర్కారు
- జిల్లాల పునర్విభజనపై కసరత్తు



**అమరావతి అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి**

రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు

- తరువాయి 2లో..



## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో
# నిరంతర పర్యవేక్షణ

- వాగులు పొంగే అవకాశం ఉన్న చోట్ల మరింత అప్రమత్తం
- డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, గాలుల విధ్వంసాన్ని గుర్తించి పునరుద్ధరణ పనులు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొంథా తుఫాను ప్రభావంపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుపాను ప్రభావంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో కలిసి సమీక్షించారు. గతంలో వచ్చిన తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సీఎం

- తరువాయి 2లో..

## మొంథా ముప్పు
# అప్రమత్తమైన ప్రభుత్వం..

- ఆర్టీజీఎస్ నుంచి మంత్రి లోకేశ్ సమీక్ష
- మొంథా తుపానుపై ఆర్టీజీఎస్ నుంచి మంత్రి లోకేశ్ సమీక్ష
- సమీక్షలో పాల్గొన్న హెూంమంత్రి అనిత, ఉన్నతాధికారులు
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశం
- తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు
- సహాయక చర్యల్లో పాల్గొనాలని కూటమి శ్రేణులకు పిలుపు

**అమరావతి అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుపాను తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ సమీక్షలో హెూంమంత్రి వంగలపూడి అనిత, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో

- తరువాయి 2లో..



## ఏపీఎస్ఆర్టీసీలో
# ఆ అధికారులకు పదోన్నతులు..

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఆరుగురు అధికారులకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా పదోన్నతి
- ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఈడీలుగా ఉన్న అధికారులకే ప్రమోషన్లు
- విజయవాడ, కడప, నెల్లూరు జోన్ల ఈడీలకు పదోన్నతి ఖరారు
- మరో 15 మంది సీనియర్ స్కేల్ అధికారులకు ఆర్ఎంలుగా ప్రమోషన్




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో పలువురు ఉన్నతాధికారులకు పదోన్నతులు లభించాయి. రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) హెూదాలో పనిచేస్తున్న ఆరుగురు అధికారులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు)గా ప్రమోట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు వీరంతా ఇన్‌ఛార్జి ఈడీలుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, తాజా ఉత్తర్వులతో వారికి పూర్తిస్థాయి ఈడీలుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన అధికారులలో జి. విజయరత్నం (విజయవాడ జోన్), జీవీ రవివర్మ (పరిపాలన), టి. చెంగల్‌రెడ్డి (ఇంజినీరింగ్) ఉన్నారు. వీరితో పాటు పి. చంద్రశేఖర్ (కడప జోన్), ఎ. అప్పలరాజు (ఆపరేషన్స్), జి. నాగేంద్రప్రసాద్ (నెల్లూరు జోన్)లకు కూడా ఈడీలుగా ప్రమోషన్ కల్పించారు. ఇదే క్రమంలో

- తరువాయి 2లో..

https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## అమెరికా ఆంక్షలకు పుతిన్ దిగివచ్చేనా?

శత్రువును జయించాలంటే కేవలం భుజబలం మాత్రమే ఉంటే చాలదు. పరిస్థితులను బట్టి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తేనే ఫలితం సానుకూలమవుతుంది. ఆవేశమే తప్ప ఆలోచన అంతగా లేని అగ్ర రాజ్యాధినేత ట్రంప్ మహాశయుడికి ఈ విషయం గ్రహించడానికి పది నెలల సమయం పట్టిందంటే ఆశ్చర్యం ఏముంది? రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరించడం తనకు చిటికెలో పని అంటూ ఆయన ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. తాను అధికారంలోకి వస్తే ఇరవై నాలుగు గంటల్లో యుద్ధాన్ని ఆపేస్తానంటూ ప్రతినలు పలికారు. కానీ, రాజకీయాల్లో రష్యా అధినేత పుతిన్ తనకంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివారన్న వాస్తవం గ్రహించడానికి ఆయనకు ఇంతకాలం పట్టింది. ఉక్రెయిన్ యుద్ధ విరమణ దిశగా ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు పుతిన్ పురిట్లోనే సంధి కొడుతున్నారు. అలస్కాలో గత ఆగస్టు నెలలో పుతిన్ తో జరిగిన ముఖాముఖీ భేటీలో ఫలితమేమీ తేలకపోవడంతో ట్రంప్ అహం దెబ్బతింది. యుద్ధాన్ని ఆపాలంటే ఉక్రెయిన్ లో కొన్ని భూభాగాలను తమకు దఖలు పరచాల్సిందేనంటూ మొండికేస్తున్న పుతిన్ ను దారికి తెచ్చేందుకు తాజాగా ఆయన రష్యా చమురు కంపెనీలపై ఆంక్షల కొరడా ఝుళిపించారు.

ఈ పరిణామం పుతిన్ ను ఒక కుదుపు కుదిపిందనే చెప్పాలి. రష్యాలోని అతి పెద్ద చమురు కంపెనీలు రాస్ నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా, ఐరోపా కూటమి విధించిన ఆంక్షల ప్రభావం రష్యా తోపాటు భారత్, చైనాలపై ఎక్కువగా పడింది. ఆ రెండు కంపెనీలకూ అనుబంధంగా పనిచేస్తున్న పలు సంస్థలకూ ఆంక్షలు వర్తింపజేయడంతో రష్యా నుంచి చమురు ఎగుమతులు స్తంభించిపోయే పరిస్థితి నెలకొంది. తాజా ఆంక్షలతో 557 చమురు షాడో కంపెనీలపై నిషేధం పడినట్లయింది. అమెరికా, ఐరోపా దేశాలు తీసుకున్న నిర్ణయం కారణంగా ముడి చమురు ధరలకు రెక్కలు వచ్చాయి. చమురును రవాణాచేసే సూపర్ ట్యాంకర్ల చార్జీలు ఒక్క రోజే 16 శాతం పెరగడం ఇందుకు ఒక ఉదాహరణ. గత రెండేళ్లలో ఇలా చార్జీలు పెరగడం ఇదే మొదటిసారి. అమెరికా ఆంక్షలకు తలొగ్గేది లేదంటూ పుతిన్ బీరాలు పలుకుతున్నా చమురు కొనుగోళ్లు నిలిచిపోతే, ఇప్పటికే యుద్ధం కారణంగా అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం అసాధ్యమన్న సంగతి ఆయనకు తెలియనిదేమీ కాదు.

తాజా ఆంక్షల వల్ల రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతోపాటు దాని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీనవడుతుందనేది నిర్వివాదాంశం. అయితే ఆంక్షలు ఎంతమేరకు కట్టుదిట్టంగా అమలవుతాయో వేచి చూద్దామనే ధోరణిలో ఆయన ఉన్నట్లు కనబడుతోంది. ఒకప్పుడు పుతిన్ ను టఫ్ గై, స్మార్ట్ గై అంటూ ఆకాశానికి ఎత్తేసిన ట్రంప్ కు పుతిన్ అసలు రూపం ఇప్పుడు బోధపడినట్లుంది. తాజాగా బుడాపెస్ట్ లో ఇరువురు అధినేతల మధ్య జరగవలసిన భేటీని పుతిన్ రద్దు చేసుకోగా, ఫలితం తేలని చర్చల వల్ల ప్రయోజనమేమిటంటూ ట్రంప్ పెదవి విరచడానికి కారణం అదే. భారత్ విషయానికొస్తే, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ రష్యా చమురును చౌకగా కొనుగోలు చేస్తోంది. భారత ముడిచమురు అవసరాల్లో మూడో వంతు భాగం రష్యానుంచే దిగుమతి అవుతోంది.

ఈ ఏడాది ఇప్పటివరకూ సగటున రోజుకు 1.7 మిలియన్ బారెళ్ల చమురును భారత్ దిగుమతి చేసుకుంటే, ఇందులో 1.2 మిలియన్ బారెళ్ల చమురు తాజాగా నిషేధం వేటు పడిన రెండు సంస్థలనుంచే రావడం గమనార్హం. ఈ దిగుమతుల్లో అధిక వాటాను రిలయన్స్, నయారా ఎనర్జీ సంస్థలే కొనుగోలు చేస్తుండగా, స్వల్ప పరిమితిలో భారత ప్రభుత్వ రంగ సంస్థలు దిగుమతి చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ లెక్కల ప్రకారం రష్యానుంచి భారత్ కు ప్రతి నెలా సుమారు ఏడు మిలియన్ బారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. ప్రపంచ ముడి చమురు, రిఫైన్డ్ వినియోగంలో ఇది ఏడు శాతానికి సమానం. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోక తప్పని పరిస్థితుల్లో భారత్ కు మళ్లీ పశ్చిమాసియాయే దిక్కయ్యేటట్లు కనిపిస్తోంది. అదే జరిగితే, ప్రస్తుతం భారత్ పై 50 శాతానికి పెంచిన సుంకాలను అమెరికా 15 శాతానికి తగ్గించే అవకాశం లేకపోలేదు.

## సహాయక చర్యలకు తరలిరండి..

నేడు, రేపు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. లీడర్ల నుంచి కేడర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం మొంథా తుపాను కాకినాడకు 270 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గంటకు 15 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు పయనిస్తోందని సీఎం వివరించారు. ఈ రోజు రాత్రికి తీవ్ర తుపానుగా బలపడి మచిలీపట్నం - కళింగపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో ముఖ్యంగా కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. “ప్రాణ నష్టాన్ని పూర్తిగా నివారించడంతో పాటు, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే మన లక్ష్యం. పరిస్థితి తీవ్రతను బట్టి ప్రజలకు రియల్ టైంలోనే మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నాం. పంటలను ముంపు నుంచి కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఇప్పటికే సూచనలు చేశాం” అని ఆయన తెలిపారు. ఎన్డీయే కార్యకర్తలు స్వచ్ఛంద సేవకులుగా ముందుకు వచ్చి ప్రభుత్వ సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు. తుపాను సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను క్షేత్రస్థాయిలో మోహరించినట్లు సీఎం వెల్లడించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలినా యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించామని, వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. గతంలో తిత్లీ, హుద్‌హుద్ వంటి పెను తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా పనిచేయాలని సూచించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం సహాయం కూడా కోరతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఏపీలో జాతీయ రహదారులపై..
### భారీ వాహనాలు బంద్

110 కిలోమీటర్లు, కాకినాడకు 190 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 280 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది మంగళవారం రాత్రికి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 90-100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగానికి చేరుకోవచ్చని తెలిపింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రంలో తుపాను ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుపాను తీరానికి సమీపిస్తుండటంతో దాని ప్రభావం ఇప్పటికే కోస్తా జిల్లాలపై మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు. కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తీర ప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత అధికంగా ఉందని తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత తుపానుల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి, అందుకు తగినట్లుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాను తీరం దాటే కాకినాడ, పరిసర ప్రాంతాలకు జాతీయ విపత్తు స్పందన దళం (%చీణ=ఖీ%), రాష్ట్ర విపత్తు స్పందన దళం (%ూణ=ఖీ%) బృందాలను వెంటనే పంపాలని ఆదేశించారు. గాలులు, వర్షాల తీవ్రతను ముందుగానే అంచనా వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సీఎంకు తెలిపారు. విశాఖపట్నంతో పాటు ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు, కోస్తాంధ్ర, యానాం, తెలంగాణ, రాయలసీమల్లోని పలుచోట్ల 21 సెంటీమీటర్లు లేదా అంతకంటే ఎక్కువ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (%×వీణ%) హెచ్చరించింది.

## పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై సచివాలంయలో నిర్వహించిన సమీక్షకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు... ఉప సంఘంలోని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక నివేదిక సిద్ధం చేశామని మంత్రులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు.

**గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే సమస్య**

కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి... దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంగళవారం జరిగిన తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం... ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశం అవుదామని తెలిపారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో
### నిరంతర పర్యవేక్షణ

ఆదేశించారు. ప్రస్తుతం మొంథా తుఫాను కోస్తాంధ్ర తీరానికి అత్యంత సమీపంగా వస్తోందని.. ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా చేరుకుని తీరాన్ని దాటే అవకాశముందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉందని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం తుఫాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని రెస్క్యూ బృందాలను, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. గాలులు, వర్ష తీవ్రతను అంచనా వేస్తూ అందుకు తగినట్టుగా యంత్రసామాగ్రిని, సమాచార పరికరాలను అత్యవసర యంత్రాలను, బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి ఎంత ప్రాంతం నీట మునిగింది...? ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో అంచనా వేసి లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గ్రామ వార్డు సచివాలయాల నుంచి క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకుని విశ్లేషించుకోవాలన్నారు. గతంలో హుద్ హుద్ తుఫాను సృష్టించిన విధ్వంసం నుంచి ప్రజలను నాలుగు రోజుల్లో తిరిగి బయటకు తెచ్చామని సీఎం గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదైనందున ఆ ప్రాంతంలోని ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మాత్తుగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయటంతో పాటు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

**ప్రభావిత ప్రాంతాల్లో తక్షణం పునరుద్ధణ చర్యలు**

గడచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా వర్ష ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి భారీ వర్ష సూచనలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు పంపామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 2,703 జనరేటర్లను కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎంకు తెలిపారు. సచివాలయాల వారీగా నిత్యావసర వస్తువులను కూడా సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్ లెస్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. జేసీబీలు, యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పశువులకు కావాల్సిన గ్రాసం కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, చెట్లు, టవర్లు, హోర్డింగ్ లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్ష ప్రభావంతో ఇప్పటి వరకూ 43 వేల హెక్టార్ల పంట నీట మునిగిందని అధికారులు తెలిపారు. కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నీటమునిగిందని సీఎంకు వివరించారు. అయితే పంట నష్టం వివరాలను రైతులు కూడా పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో మార్పు చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తుఫాను కారణంగా రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల ధ్వంసం వంటివి జరిగితే ఊళ్ల మధ్య రాకపోకలకు ఇబ్బంది అవుతుందని... అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, అందరూ ఫీల్డులో ఉన్నారని మంత్రి నారా లోకేష్ సీఎంకు వివరించారు. ప్రస్తుతం రాయలసీమలో వర్షాలు లేనందున ఎగువ నుంచి వచ్చే కృష్ణా ప్రవాహాలను అక్కడి చెరువులు నింపే ప్రక్రియను చేపట్టాలని సీఎం జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఒక్క టీఎంసీ నీటిని కూడా కోల్పోకుండా నీటిని నింపే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మొంథా ముప్పు అప్రమత్తమైన ప్రభుత్వం..

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని అధికారులు మంత్రి లోకేశ్‌కు వివరించారు. తుపాను ఏ ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందనే వివరాలను లోకేశ్ ఆరా తీశారు. అలాగే, నిన్నటి నుంచి వివిధ జిల్లాల్లో నమోదైన వర్షపాతం లెక్కలను అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కూటమి నేతలు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తుపాను వల్ల పంటలకు వాటిల్లే నష్టంపై కూడా మంత్రి ఆరా తీశారు. ముఖ్యంగా కోనసీమ జిల్లాలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని లోకేశ్ స్పష్టం చేశారు.

## ఏపీఎస్ఆర్టీసీలో
### ఆ అధికారులకు పదోన్నతులు..

మరో 15 మంది సీనియర్ స్కేల్ కేడర్ అధికారులకు కూడా పదోన్నతులు కల్పించారు. వీరిని స్పెషల్ స్కేల్ సర్వీస్ (ఆర్ఎం) కేడర్‌కు ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ పదోన్నతుల ద్వారా ఆర్టీసీలోని కీలక విభాగాల్లో పరిపాలన మరింత పటిష్ఠం కానుందని భావిస్తున్నారు.

## విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు
### అప్రమత్తంగా ఉండాలని సూచనలు - ఏఈ ఎస్. శ్రీరామకృష్ణ




కొత్తపేట, అక్టోబర్ 28:( తెలుగు రాష్ట్రం)

తుఫాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాను కారణంగా ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోకుండా, తీగలు తెగిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఎస్. శ్రీరామకృష్ణ తెలిపారు.తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. “ఎక్కడైనా స్తంభాలు పడిపోతే, తీగలు తెగిపోతే వెంటనే మరమ్మత్తు బృందాలు చర్యల్లోకి దిగుతాయి. ప్రజలు భయపడకుండా, సహకరించాలని కోరుతున్నాం” అని ఆయన పేర్కొన్నారు.
అత్యవసర సమయాల్లో ప్రజలు నేరుగా 94408 12657 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

**ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు:**

రోడ్లపై లేదా ఇళ్ల పరిసరాల్లో విద్యుత్ తీగలు తెగి పడ్డా వాటిని ముట్టుకోవద్దు. వెంటనే సమాచారం ఇవ్వాలి.వంగిన లేదా పడిపోయిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి.భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ఇంటి మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేయాలి.తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు తాకరాదు.గాలులు ఎక్కువగా ఉన్న సమయంలో చెట్లు లేదా స్తంభాల కింద నిలబడరాదు. “ప్రజల భద్రతే మా ప్రాధాన్యం. అధికారులు అందించే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని కోరుతున్నాం,” అని ఏఈ శ్రీరామకృష్ణ తెలిపారు.

## లక్ష్మీపోలవరం గ్రామంలో తుఫాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు
### ఎమ్మెల్యే బండారు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు
### భోజన ఏర్పాట్లు చేసిన టీడీపీ నాయకులు



రావులపాలెం, అక్టోబర్ 28:( తెలుగు రాష్ట్రం)

మొంథా తుఫాను ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. తుఫాను కారణంగా ఇళ్లకు నష్టం వాటిల్లిన కుటుంబాలు, పెంకుటిల్లు, రేకు షెడ్లలో నివసిస్తున్న ప్రజలను సురక్షితంగా ప్రభుత్వ పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రామస్థుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో పునరావాస పనులు నిర్వహిస్తున్నారు. బాధితులకు అవసరమైన ఆహారం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ముందుకొచ్చి బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు ప్రజలు పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజల సమస్యలను సమీక్షించేందుకు స్థానిక అధికార బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేపట్టుతున్నాయి.

# మొంథా ‘అల’జడి
## తీరాన్ని తాకిన ‘మొంథా’ తుపాను...

బంగాళాఖాతంలో ఏర్పడిన ‘మొంథా’ తీవ్ర తుపాను కోస్తాంధ్రపై తన ప్రతాపాన్ని చూపించడం ప్రారంభించింది. మంగళవారం సాయంత్రం కాకినాడ-మచిలీపట్నం మధ్య తీరాన్ని తాకిన ఈ తుపాను, తీర ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. గత 6 గంటలుగా గంటకు 17 కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్న ఈ తుపాను, ప్రస్తుతం మచిలీపట్నానికి 120 కి.మీ, కాకినాడకు 110 కి.మీ, విశాఖపట్నానికి 220 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. కాకినాడ జిల్లాలోని రాజోలు-అల్లవరం మధ్య ఇది పూర్తిగా తీరం దాటనుందని, ఈ ప్రక్రియ పూర్తవడానికి మరో మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తుపాను తీరం దాటే సమయంలో తీరప్రాంత జిల్లాల్లో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని, సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ఈ గాలుల తీవ్రతకు ఇప్పటికే పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. తుపాను ప్రభావంతో కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రానున్న 24 గంటల్లో తీరప్రాంతంలో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ప్రకాశం జిల్లాల్లో కూడా భారీ వర్షాలు పడతాయని తెలిపారు. బంగాళాఖాతంలో 4 నుంచి 5 మీటర్ల ఎత్తున అలలు ఎగసిపడుతుండగా, తీరంలోకి 1 నుంచి 2 మీటర్ల ఎత్తున సముద్రపు నీరు చొచ్చుకొచ్చే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. దీని ఆధారంగా కాకినాడ, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

**అప్రమత్తమైన ప్రభుత్వం, సహాయక చర్యలు ముమ్మరం**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత 10 జిల్లాల్లో జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాలను మోహరించారు. 200 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు 1,000 మందికి పైగా సివిల్ స్పందన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంతాలు, పాత భవనాల్లో నివసిస్తున్న సుమారు 50,000 మందిని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, “ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. తుపాను తీరం దాటే సమయంలో ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. బలహీనమైన నిర్మాణాలు, విద్యుత్ లైన్లకు దూరంగా ఉండాలి. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి” అని సూచించారు. ఏదైనా అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1077కు ఫోన్ చేయాలని ఆయన కోరారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దిశ మార్చుకున్న మొంథా

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిసర తీర ప్రాంతాలలో మంగళవారం రాత్రికి తీరం దాటే అవకాశం



అమలాపురం అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తుఫాన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిసర తీర ప్రాంతాలలో నేటి (మంగళవారం) రాత్రికి తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు జిల్లా మొంథా తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి విజ య రామరాజు వెల్లడించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్ నుండి వారు గ్రామ సచి వాలయ స్థాయి వరకు వీడియో కాన్ఫరె న్స్ నిర్వ హించి మొంథా తుఫా న్ ను సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు సన్నద్ధత సహాయక చర్యల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడు తూ సముద్ర తీర ప్రాంతానికి ఒక కిలోమీటర్ పరిధి లో ఉన్న కచ్చా గృహాలు పక్కా గృహాలలో నివసిస్తున్న వారిని మధ్యాహ్నం రెండు గంటల లోపుగా పోలీస్ సిబ్బంది సహకా రంతో బై ఫోర్స్ ను వినియోగించి తప్పనిసరిగా మ్యాపింగ్ చేసిన పునరావాస కేంద్రా లకు తరలిస్తూ ప్రాణ ఆస్తి నష్టాలను పూర్తిగా నివారిం చాలన్నారు ప్రతి పునరా వస కేంద్రానికి కేటాయించిన ఇన్చార్జి అధికారి నాణ్య మైన ఆహారం, అన్ని రకాల ఔషధాలతో మెడి కల్ క్యాంపులు సురక్షితమైన త్రాగునీరు వంటి కనీస వస తులు కల్పన ద్వారా తా త్కాలికంగా ఆశ్రయం పొందేలా చర్యలు చేపట్టా లన్నారు. మొంథా తుఫాన్ ముప్పు కోనసీమ జిల్లాకు ఉన్నందున తీరప్రాంత ప్రజలను తక్షణం పునరా వాస కేంద్రాలకు పోలీసుల సహకారంతో తప్పనిసరిగా తరలించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో క్షేత్రస్థాయి అధికా రులు తీర ప్రాంత వాసు లను అప్రమత్తం చేస్తూ సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తర లిస్తూ నాణ్యమైన ఆహారాన్ని ఆరోగ్య భద్రత ను కల్పిం చాల న్నారు తాగునీటి సమస్య తలెత్తకుండా, ఎక్కడా ఆహారం తాగునీరు కలుషితం కాకుండా హైజిన్ వంటి అన్ని జాగ్రత్తలు పాటిం చాలన్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడం జరిగిందని ఎక్కడా ఎటు వంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించ కుండా అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించా రు. జిల్లా యంత్రాం గమంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుఫాన్ను సమర్ధవం తంగా ఎదుర్కోవాలన్నారు. తుఫాను తీరాన్ని దాటే ప్రాంతంలో సుమారుగా గంట సమయం పాటు తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. తుఫాన్ అనంతరం ముం దుగా రోడ్డు కనెక్టివిటీ కొరకు చెట్లు స్తంభాలు తొలగిం చాలని పవర్ కనెక్టివిటీ నీ విద్యుత్ స్తంభాలను ట్రాన్స్ఫా ర్మర్ల కండక్టర్లు ఏర్పాటు ద్వారా పునరు ద్ధరణ కై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లా డుతూ తీర ప్రాంతంలో జి ప్లస్ వన్ గృహాలలో ఉన్న వారి తప్ప మిగిలిన సముద్ర తీరానికి కిలోమీటర్ పరిధిలో ఉన్న కచ్చా పక్కా గృహాలలోని వారు తప్పని సరిగా పునరావాస కేంద్రా లలో ఆశ్రయం పొందాలన్నారు. కాట్రేనికోన ఐ పోలవరం సఖినేటిపల్లి మల్కిపురం, ఉప్పలగుప్తం కొత్తపేట మండలాలు సు మారుగా 7 వేల మందినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు ఈ తరలింపు ప్రక్రియను అధికారులు మ ధ్యాహ్నం 2 గంటల్లోపు పూర్తి చేయాలన్నారు శిథిలావస్థకు చేరిన వసతి గృహాలలో విద్యార్థినీ విద్యా ర్థులు నివాసం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ముంపు బాధితుల తరలింపులో ఎటువంటి అలసత్వాన్ని వహించరాదని ఆయన పునరుద్ఘాటించారు. మొంథా తుఫాన్ రిస్క్యూ ఆపరేషన్స్ పునరావాసం వంట అంశాలలో ఎక్కడ రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు జిల్లా యం త్రాంగం నిర్దిష్ట ఆదేశాలను అందరూ తూ చా తప్ప కుండా ఆచరించి మొంథా తుఫాన్ ముప్పును సమర్థ వంతంగా ఎదుర్కొనాలని ఆదేశించారు. తుఫాన్ తీరాన్ని దాటే సమ యంలో పూర్తిగా విద్యుత్ సరఫరా ను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. తుఫాన్ తీరాన్ని దాటిన సమయంలో తీర ప్రాంత వాసులు ఎవరు ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్ళ రాదని సురక్షితంగా ఇంటిలోనే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీరాన్ని దాటే సమయాన్ని క్షేత్రస్థాయి అధికా రులకు తెలియజే యడం జరుగుతుంద న్నారు. ఆ సమ యంలో అందరూసంయమనం పాటించి రాబోయే 48 గంటలు మరింత అప్రమత్తంగా ఉండా లన్నారు. తుఫాను దృష్ట్యా మార్కెట్లో నిత్యవసర వస్తువులు ధరలు అదుపులో ఉంచా లని ఎడి మార్కెట్ ని ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు తుఫాన్ ప్రమాదం ముగిసే వరకు మండల, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి సహా యక చర్యలను పర్యవేక్షిం చాలని ఆదేశించారు. సహా యక కేంద్రాలలో భోజన, వసతి సదుపా యాలు సక్రమంగా ఉండాలన్నారు ప్రభావిత ప్రాంతాల్లో నిత్య వసర వస్తువులు విల్వలు తగినన్ని అందుబాటులో ఉందుకోవాల న్నారు. సమాచార వ్యవస్థ సేవలలో ఎటువంటి అం తరాయం లేకుండా చూడా లన్నారు. వివిధ శాఖల సమన్వయం తో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తీర ప్రాంత ప్రజల తరలింపు ఆపరేషన్, పునరా వాసం, ఆస్తి ప్రాణ నష్టాలు, రహదారులు పునరుద్ధరణ విద్యుత్ పున రుద్ధరణ వం టి చర్యల ద్వారా మొంథా తుఫాన్ ముప్పును ఎదుర్కొనాలన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ తీర ప్రాంతంలో మెరైన్ పోలీ సులతోపాటుగా సుమారు 150 గ్రామ సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీసులతో తీర ప్రాంత గస్తీ ని నిర్వహించి సముద్ర తీరంలో ఎవరు సంచరించకుండా చర్యలు చేపడతారన్నారు. ఈ కాన్ఫరెన్స్లో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, డిఆర్ఓ కే మాధవి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొ న్నారు













మొంథా తుఫాను దృష్ట్యా జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీ అచ్చం నాయుడు గారు స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న గౌరవ శాసనసభ్యులు శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు





తుఫాను పునరావాస కేంద్రమైన ఓడలరేవు తుఫాన్ షెల్టర్ లో ప్రజలకు తుఫాను తీవ్రతను వివరించి జాగ్రత్తలు చెబుతున్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు





నక్క రామేశ్వరం తుఫాను షెల్టర్ ను పరిశీలించి, పునరావాస కేంద్రంలో ప్రజలను, అధికారులను అప్రమత్తంగా ఉండాలని సూచించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు





వాసలతిప్ప గ్రామంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల అనందరావు గారు, అర్డీఓ మాధవి గారు, ఎం ఆర్ ఓ దివాకర్ గారు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు గారు, సీఐ ప్రశాంత్ కుమార్ గారు తదితరులు..



## ఓడలరేవు తీర ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి అచ్చంనాయుడు

అమలాపురం అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీ అచ్చం నాయుడు, ఓడలరేవు తీర ప్రాంతాన్ని పరిశీలించారు. తుపాను ప్రభావ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచలను చేశారు. మంత్రి వెంట ఎంపీ హరీష్ మాధుర్ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఉన్నారు.

## ప్రభుత్వ యంత్రాంగానికి పార్టీ నేతలు సహకరించండి

అమలాపురం అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రభుత్వ యంత్రాంగానికి పార్టీ నేతలు సహకరించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. తిత్లీ, హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు ఏ విధంగా అయితే సమర్ధవంతంగా ఎదుర్కొన్నామో... అదే విధంగా ఇప్పుడు కూడా మొంథా తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగానికి ఎన్డీఏ పార్టీల నేతలు, కార్యకర్తలు సహకరించాలని సీఎం చంద్రబాబు గారు పిలుపునిచ్చారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

# మొంథా తుఫాన్‌పై అప్రమత్త చర్యలు

## -అధికారులతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కాన్ఫరెన్స్



**పోలవరం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సూచించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, ఆర్డిఓ, ఏడు మండలాల ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావం పడే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు, రక్షణ ఏర్పాట్లు, పునరావాస సన్నాహాలు వంటి అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ప్రభుత్వ యంత్రాంగం ఇచ్చే సూచనలను పాటించాలని ఎమ్మెల్యే బాలరాజు సూచించారు. అవసరమైతే తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదే విధంగా బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుఫాన్‌కు సంబంధించిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రజలు ఏవైనా అత్యవసర పరిస్థితుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 9110362916కు సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వాలు ఆదివాసీలను చిన్నచూపు చూస్తున్నాయి



**కూనవరం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేకరి):** రాష్ట్రంలో గల సీతంపేట, పార్వతీపురం పాడేరు, అరుకు, రంపచోడవరం, చింతూరు, కోట రామచంద్రపురం, శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో గల ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం పూర్తిగా అమలుకు నోచుకోవటం లేదని ఆంధ్ర రాష్ట్ర గిరిజన సంఘాల కార్యచరణ సమితి ఉపాధ్యక్షుడు కోరాడ త్రినాథ్ దొర అన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో పని చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆదివాసి చట్టాలను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీని మూలంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదవ షెడ్యూల్ భూభాగం మొత్తం నాన్ ట్రైబల్ కబ్జాలోకి వెళ్ళిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని నాన్ ట్రైబల్ వలసలు పెరిగిపోయాయని అక్రమ కట్టడాలు, వ్యాపార సముదాయాలు విచ్చలవిడిగా నిర్మించబడుతున్నాయి. దీని మూలంగా ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసుల హక్కులను హరించబడుతున్నాయి. నాన్ ట్రైబల్ సంస్కృతి ఆదివాసి సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తుందని, దీని మూలంగా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు మనుగడ ఆటంకం కలుగుతుంది. కనుక ఆదివాసిలు ఉనికిని కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని, కావున వన్ బై సెవెంటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, నాన్ ట్రైబల్ వలసలు అరికట్టాలని, ఏజెన్సీలో వలస నాన్ ట్రైబల్ కి ఎటువంటి గుర్తింపు కార్డు జారీ చేయొద్దని కోరుతూ జాతీయ షెడ్యూల్ తెగల కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. అలాగే పోలవరం ప్రాజెక్టు కింద ముంపుకి గురవుతున్న దేవీపట్నం, చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం, ఎట్టపాక, కోనూరు, వీరులపాడు, పోలవరం మండలాలకు సంబంధించిన స్థానిక నిర్వాసితులకు ఆదివాసులకు సరైన పునరావాసం ప్యాకేజీ, భూమిని ఇవ్వటంలో అధికారులు, ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వలసలు వచ్చిన నాన్ ట్రైబల్స్ ప్రభుత్వ భూములు, ఆదివాసీ ల భూములను, కబ్జాలు చేసి భూముల ద్వారా కోట్ల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని ప్యాకేజీ రూపంలో దండుకుంటున్నారు. వారికి అర్హత లేదని తెలిసి కూడా కమిషన్ కోసం అధికారులు కక్కుర్తి పడి ప్రభుత్వ ధనాన్ని దోచిపెడుతున్నారు. అంతేకాకుండా నిర్వాసితుల కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూమి విషయంలో కూడా ప్రభుత్వ భూమి కబ్జా చేసి, తిరిగి ప్రభుత్వానికి అమ్ముకుంటూ వలస నాన్ ట్రైబల్ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. వీరికి స్థానిక అధికారులు అన్ని విధాలుగా కమిషన్ కోసం సహకరిస్తున్నారని స్థానిక నిర్వాసిత ఆదివాసులకి ప్యాకేజీ కల్పించాలని, నాన్ ట్రేబులు పోలవరం ప్యాకేజీ ఇవ్వద్దు అని, ఇప్పటివరకు ప్రభుత్వ భూములు అమ్ముకొని, ప్రభుత్వ భూములు పేరుతో ప్యాకేజీలు పొందిన నాన్ ట్రైబుల్స్ దగ్గర నుండి డబ్బులు రికవరీ చేయాలని ఆయన కోరారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే దీనిపై కేంద్రానికి, రాష్ట్రపతికి పార్లమెంట్ పిఓపికి, పార్లమెంట్ ఎథిక్స్ కమిటీకి, జాతీయ కమిషనర్ కి 15 లెటర్ల ద్వారా ఫిర్యాదు పంపించడం జరిగింది. దీనిపై కేంద్రంలో ఉన్న 41 మంది ఎంపీలు కచ్చితంగా శీతాకాల సమావేశంలో మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు కోరాడ త్రినాథ్ దొర పేర్కొన్నారు.

# పుష్కర ఘాటును శుభ్రం చేసిన టిడిపి నాయకులు

**కూనవరం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామపంచాయతీ శబరి గోదావరి సంగమంలో శివాలయం పుష్కర ఘాటు వద్ద డ్రైనేజీ వ్యవస్థను టిడిపి నాయకులు బాగు చేశారు. అధ్వానంగా ఉన్న మట్టిని తీసేసి కార్తీక మాసం సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా శుభ్రం చేశారు. మండల టిడిపి అధ్యక్షులు ఎడవల్లి భాస్కర్ ఆధ్వర్యంలో కూనవరం గ్రామపంచాయతీ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించడమే కాకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు చెలికాని ఉమామహేశ్వరరావు, కూనవరం గ్రామ శాఖ అధ్యక్షులు హెచ్. రవి శబరి- గోదావరి సంగమం పుష్కర ఘాట్, పోచమ్మ రేవు పుష్కర ఘాట్, సాయిబాబా గుడి పుష్కర ఘాటు లైట్లను కూడా అమర్చారు.

# వడ్డీల కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు



**టీ.నర్సాపురం, అక్టోబర్28 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండల పరిధిలోని బొర్రంపాలెం గ్రామం ఎర్రకాలువ జలాశయం దగ్గరలో నివసిస్తున్న వడ్డీ కులస్తులు అందరిని మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎమ్మార్వో సాయిబాబు, ఎస్ఐ జయ బాబు, గ్రామ నాయకుల సహకారంతో గర్భిణీ స్త్రీలను, చిన్నపిల్లలను, వృద్ధులను అందరిని సురక్షిత ప్రదేశాలకు తరలించడం, మైక్ ద్వారా తగు జాగ్రత్తలు వివరించడం, తుఫాను తర్వాత తీసుకొను చర్యలకు ప్రజలందరూ భాగస్వామ్యం అవ్వాలని ఎస్ఐ జయబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ అడప నాగరాజు, గండబోయిన శ్రీను, కంపసాటి రమేష్, శివంగుల సత్యనారాయణ, గండబోయిన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పార్థసారథిని కలిసిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి



**టీ. నర్సాపురం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ, ప్రజా సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథిని మాజీ శాసనమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావుతో పాటు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పశ్చిమగోదావరి జిల్లా బిసి విభాగాల కో ఆర్డినేటర్ కొండపల్లి రవి విజయవాడలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. 2019- 2024 వైసిపి ప్రభుత్వంలో ఇళ్ళు మంజూరు కాగా కొంతమంది నిర్మాణాలు చేసుకోలేదని, అలాగే వైసిపి స్థానిక నాయకులు ఒకరి పేరు మీద ఇళ్ళు మంజూరు అయితే ఇంకొకరికి అవి కేటాయించి అక్రమంగా నిర్మాణాలు జరిపారని ఆయన ఆరోపించారు. దాని వలన ఇప్పుడు గృహాలకు ఆన్లైన్ చేసుకుంటుంటే గతంలోనే మీకు మంజూరు అయినట్టు చూపించడం జరుగుతుందని, దీని వలన నిజమైన నిరుపేద లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటి విషయంలో మండల తహసిల్దార్ లకు ఆదేశాలు ఇచ్చి విచారణ జరిపించాలని కోరారు. పేర్లు ఆన్లైన్ జాబితా నుంచి తొలగించి నిజమైన నిరుపేద లబ్దిదారులకు ఆన్లైన్ చేసి గృహాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో జగనన్న ఇళ్ళ పేరుతో వైసిపి నాయకులు అనర్హులకు ఇంటి స్థలాలు కేటాయించారని, వాటిమీద విచారణ జరిపి అవి పేదలకు అందజేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

# రంపచోడవరంను జిల్లాగా ప్రకటించాలి

## -ఆదివాసి టాప్ టెన్ డిమాండ్



**కూనవరం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆదివాసి టాప్ టెన్ టీం అత్యవసర సమావేశం మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసి టాప్ టెన్ నాయకుడు బాడిస వెంకటేష్ మాట్లాడుతూ గతంలో ఆంధ్రప్రదేశ్ జిల్లాల విభజన సమయంలో మన్యం జిల్లాల పేరుతో పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేయడం వలన ఈ ప్రాంత వాసులైన ఉద్యోగస్తులు, రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల వారు చాలా ఇబ్బందులు అనుభవిస్తున్నారు. కావున అప్పుడు చేసిన తప్పును మరల పునరావృతం చేయవద్దని కారం తమ్మన్న దొర జిల్లాగా చింతూరు డివిజన్, రంపచోడవరం డివిజన్ అవసరం అయితే కుకునూరు, వెలేరుపాడు, పోలవరం ప్రాంతాన్ని కలిపి మరొక ఆదివాసి జిల్లాను రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకానీ ఈ ఏజెన్సీ ప్రాంతాన్ని రాజమండ్రి జిల్లాలో విలీనం చేయవద్దని తెలియజేశారు. ఆ రకంగా విలీనం చేస్తే ఏజెన్సీలో ఉన్న చట్టాలు, హక్కులకు భంగం వాటిల్లుతుందని అటువంటి నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తులో ఆదివాసి టాప్ టెన్ ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంగాల కోటేశ్వరరావు, గుర్రం అర్జున్, గుండి లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## -కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. మంగళవారం అన్ని విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే రెండు, మూడు రోజుల్లో తుఫాన్ పరిస్థితిని అంచనా వేసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ చిన్న సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర హోర్డింగులను వెంటనే తొలగించాలన్నారు. కూలిన చెట్లను తొలగించడంతో పాటు అవసరమైన చోట చెట్ల కొమ్మలను కత్తిరించాలన్నారు. కంట్రోల్ రూమ్ (9494060060) నెంబర్ 24 గంటలూ పని చేయాలన్నారు. అలాగే పునరావాస కేంద్రాలలో తగిన ఆహారం, త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ప్రభుత్వ సహాయక చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పిసా చట్టం ప్రకారం ఆదివాసి జిల్లాలు ఏర్పాటు చేయండి

## -ఆదివాసి సంక్షేమ పరిషత్




**కూనవరం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సీనియర్ నాయకుడు పైదా ముత్తయ్య మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రాంతాలలో ఆర్టికల్ 342(1%ఐ%2), ఆర్టికల్ 244 అడ్మినిస్ట్రేషన్, స్వయం పాలన అధికారం పీసా చట్టానికి ఉన్నందున సర్వ అధికారులను ఉపయోగించి ఆదివాసుల భౌగోళిక సామాజిక, విద్య, వైద్య రాజకీయ, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆదివాసి జిల్లాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతాల్లో తాటి చెట్లు కోస్తున్న కళ్ళు గీత కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలి. అలానే తాటి చెట్టు నుండి వచ్చే ఉత్పత్తులైన ఆకులు, బెరడు, పండ్లు, కల్లుతో మైదాన ప్రాంతంలో ఉత్పత్తి చేసే నీరా, తాటి బెల్లం, స్వీట్లు, నారతోటి తయారు చేసే వివిధ రకాల ఉత్పత్తుల సూక్ష్మమైన పరిశ్రమలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ యువతి యువకులకు చదువుకున్న తర్వాత ఉపాధి కొరకు ప్రభుత్వము, ప్రైవేట్ రంగాలలోనూ ప్రత్యేకమైన ఉద్యోగ చట్టాన్ని ప్రభుత్వం తయారు చేయాలని డిమాండ్ చేశారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నవంబర్ 8న సెమినార్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పులి వీరయ్య, రాఘవయ్య, మినప నాగేశ్వరావు, మీడియం కొండయ్య, సున్నం కన్నయ్య, సోడి తమ్మయ్య, దుమ్మిరి రామయ్య పాల్గొన్నారు.

# ప్రతి పంట రక్షణలో రైతులు కొన్ని చర్యలు చేపట్టాలి

## - వ్యవసాయ శాఖ అధికారి



**రౌతులపూడి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** రౌతులపూడి మండల వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రతి పంటలో రైతులు రక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు తెలియజేశారు. పంట పొలాలను మంగళవారం పరిశీలించిన ఆయన పొలంలో నీరు నిలవ ఉంటే వెంటనే నీటిని బయటికి పంపించే ఏర్పాటు చేయాలని, పంట పూత కాయ దశలో ఉండగా ఒక ఎకరానికి యూరియా 30 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పటాస్ 15 కిలోలు భూమిలో వేయుట, 2 శాతం యూరియా లేదా 2 శాతం పొటాషియం నైట్రేట్ ను 1 శాతం మెగ్నీషియం సల్ఫేట్ తో కలిపి 5 నుండి 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని తెలిపారు. ఆకుమచ్చ, కాయ కుళ్ళు తెగులు ఉన్నట్లయితే మాంకో జెబ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి, కాపర్ ఆక్సి క్లోరైడ్ ను ఒక లీటరు నీటికి 3 గ్రాములు కలిపి మార్చి మార్చి పిచికారి చేయుట, కేవలం ఆకుమచ్చ తెగులు మాత్రమే పంటలో ఉన్నట్లు గుర్తించినట్లయితే ప్రొపికోనజోల్ ఒక మిల్లీలీటర్ రసాయనాన్ని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఒకవేళ పూత కాయలు రాలుతున్నట్లయితే నాఫ్త్ లీన్ ఎసిటిక్ యాసిడ్ (ప్లానోఫిక్స్ ) 0.25 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటి కలిపి పిచికారి చేయాలని సూచించారు. రైతులు ప్రతి పంటలు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పంట చేతుకొచ్చే దశలో ఉన్నందున రైతులు సూచనలన్నీ పాటించాలని వ్యవసాయశాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు రైతులకు తెలిపారు.

# తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

## -సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్



**కూనవరం, అక్టోబర్28(తెలు గురాష్ట్రం విలేకరి):** మొంథా తుఫాన్ పరిశీలన కొరకు కూనవరం మండల పర్యటనలో భాగంగా చినార్కూర్ వచ్చిన సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ని ఆదివాసీ నాయకులు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ ని కలిసి వరదల కారణంగా 5 నెలలుగా వ్యవసాయ పనులు కూలీ పనులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, నిత్యావసర సరుకులు కొనుక్కోవడానికి డబ్బుకు లేక దిక్కుతోచని స్థితిలో పంచాయతీ ప్రజలు ఉన్నారని వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి నిత్యవసర సరుకులు అదేవిధంగా 25 కేజీల బియ్యం ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలు తక్షణ సహాయంగా ఇవ్వాలని, నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సబ్ కలెక్టర్ కి నాయకులు విన్నవించారు. అదేవిధంగా చిన్నారుకుర్ గ్రామంలో 40సంవత్సరాల క్రితం నిర్మించిన అంగన్వాడి కేంద్రం శిధిల వ్యవస్థలో ఉందని కొన్ని సంవత్సరాలుగా ఈ విషయాన్ని ఐటిడిఏలో పిర్యాదు చెయ్యడం, పిఓకి ప్రత్యక్షంగా ఆ అంగన్వాడి కేంద్రాన్ని చూపించడం జరిగింది. పిఓ స్పందిస్తూ ఈ భవనానికి తక్షణమే నిధులు కేటాయించి నెల రోజుల్లో నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చి ఉన్నారు. కానీ భవన నిర్మాణాన్ని ఇప్పటి వరకు మరమ్మత్తులు గాని కొత్త భవనం గాని మొదలు పెట్టలేదని పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు, బాలింతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ వారితో మాట్లాడుతూ ముందుగా మండల ప్రజలందరూ ఈ తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులందరూ ఎప్పటికప్పుడు ప్రాంతాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే వరద సహాయం నెల రోజుల్లో అందే విధంగా కృషి చేస్తానని,ఈ వరద ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూస్తున్నానని అదేవిధంగా నష్టపోయిన పంట కూడా పరిహారం అదేవిధంగా ప్రభుత్వంతో కలెక్టర్ తో మాట్లాడాలని త్వరలోనే పరిహారం కూడా అందుతుందని, అలాగే చిన్నారుకు అంగన్వాడి కేంద్రాన్ని వెంటనే పరిశీలించి నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులతో పిఓ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెసా కార్యదర్శి కుంజా అనిల్, అధ్యక్షులు సోడే ముత్తయ్య, పెసా కార్యదర్శి బొడ్డు రమేష్, అధ్యక్షులు కారం.దారయ్య, కూటమి పార్టీల నాయకులు ఎడవల్లి భాస్కరరావు, పాయం వెంకయ్య, చెలికాని ఉమామహేశ్వరరావు, కుంజా విజయ్, శ్యామల లింగారావు, సోడే రామకృష్ణ, ఐటీడీఏ పిఓ తో పాల్గొన్న అధికారులు స్థానిక ఎమ్మార్వో శ్రీనివాసరావు, ఎంపీడీవో జగన్నాథ రావు, అగ్రికల్చర్ ఆఫీసర్ దేవి, సబ్ ఇన్స్పెక్టర్ లతా శ్రీ, చిన్నార్కూర్ పంచాయితీ సచివాలయ సిబ్బంది, కార్యదర్శి రోజా, వీఆర్వో ధర్మరాజు, డి ఎ వెంకటేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సర్వేయర్ జోగయ్య వివిధ శాఖల, ఐసిడిఎస్, వెలుగు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు.. కూలీలను ఆదుకోవాలి

## తుఫాన్ ప్రభావిత ప్రాంత ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలి..

వ్యవసాయ కార్మిక సంఘం



**ఏలూరు జిల్లా/కుక్కునూరు: తెలుగు రాష్ట్రం ప్రతినిధి:** మండలంలో వ్యవసాయ పనులు లేక కరువు పరిస్థితి ఏర్పడి ఇబ్బంది పడుతున్న కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం కుక్కునూరు మండల కార్యదర్శి కూరాకుల. బాబూరావు ప్రభుత్వాన్ని కోరారు. గోదావరి వరదలు, తుఫాన్ల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయి సాగు తగ్గి కూలీలకు పని లేకుండా పోయిందని అన్నారు. దీంతో పూట గడవని పరిస్థితి నెలకొని ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనులు కోల్పోయిన వ్యవసాయ కూలీలకు నిత్యావసర సరుకులతో పాటు ఒక్కొక కుటుంబానికి రూ 2 వేలు ఆర్థిక సహాయం చేసి అన్నీ విధాలుగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రకటన చేసిన వారిలో సోయం. దేవయ్య,కవులూరి. సోమయ్య,ఉంగ,రమేష్, నవీన్,మారయ్య ఉన్నారు.

# చింతపల్లిలో నీటి కొరతకు చెక్..

## జనరేటర్‌తో మళ్లీ సరఫరా ప్రారంభం.



**చింతపల్లి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మొంతా తుఫాను ప్రభావంతో చింతపల్లి పట్టణంలో గత రెండు రోజులుగా విద్యుత్తు నిలిచిపోవడంతో త్రాగునీటి సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై స్పందించిన సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో సీతామాలక్ష్మి, నీటిపారుదల శాఖ జేఈ గడుతూరి స్వర్ణలత అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంటనే స్పందించడంతో అత్యవసర జనరేటర్ ఏర్పాటు చేసి గ్రామంలో త్రాగునీటి సరఫరా పునరుద్ధరించారు. టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం పర్యవేక్షణలో నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతున్నది. ప్రజల సమస్యలు పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. వర్షాల కారణంగా పైపుల తవ్విన కాలువల్లో మట్టి చేరడం, అలాగే కరెంటు లేక పగిలిన పైప్‌లైన్‌ల వల్ల కొన్ని కాలనీలలో ఇంకా సమస్యలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. వాటిని కూడా త్వరితగతిన సరి చేయనున్నట్టు భరోసా ఇచ్చారు. తుఫాను సమయంలో అప్రమత్తంగా ఉండి ప్రభుత్వం అందిస్తున్న అత్యవసర సేవలను ప్రయోజనపడేలా వినియోగించుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సేవలలో టిడిపి నాయకులు ముత్యం చిన్నబాబు, రీమల పౌలు, నల్లాల శివ తదితరులు పాల్గొన్నారు.

# లంకపాకల రోడ్డులో ప్రమాద ఘంటికలు.

## రోడ్డు అంచు గండిపాలు.. ఒక్క క్షణం నిర్లక్ష్యం ప్రాణాలకు ముప్పు






**చింతపల్లి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మొంతా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు రహదారుల పరిస్థితిని దారుణంగా దెబ్బతీశాయి. జీకే వీధి-సీలేరు ప్రధాన రహదారి లంకపాకల సమీపం నూతిబంద వద్ద రోడ్డు అంచు భారీగా కోతకు గురై గండి ఏర్పడింది. రహదారి పక్కనే బొరియైపోయిన ఈ గండి వాహనదారుల ప్రాణాలకు పెను ముప్పుగా మారింది. వర్షాలు కొనసాగుతున్న నేపధ్యంలో గండి మరింత విస్తరించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జీకే వీధి ఎస్సై కే. సురేష్, మండల తహశీల్దార్ అన్నాజీ రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత శాఖలకు ఆనవాళ్లు పంపి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాన్ని తాత్కాలికంగా రాళ్లు పెట్టి, వాహనదారులకు హెచ్చరికలు జారీ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఈ రహదారి సీలేరు, చింతపల్లి, జీకే వీధి, సమీప గిరిజన గ్రామాలకు కీలక మార్గం. ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరుగుతుంది. వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. ప్రమాదభయంతో ప్రయాణికులు ఆ రహదారిలో ప్రయాణం చేసేటప్పుడు ఆందోళన చెందుతున్నారని తెలిసింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రాణపాయ పరిస్థితి ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాహనదారులు ఈ మార్గాన్ని ఉపయోగించాలని సూచించారు. శాశ్వత మరమ్మతులు అత్యవసరం రోడ్డు స్థిరత్వం కోసం రోడ్లు-భవనాల శాఖ వెంటనే స్పందించి బలమైన రక్షణ గోడ ఏర్పాటు చేసి, శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మొంథా తుఫాన్ బెడద.. కొత్త ఇళ్లపైనే చింతచెట్టు బీభత్సం!

## రాళ్లగడ్డలో కుటుంబాల ఆర్తనాదం.
## విద్యుత్ స్తంభం విరిగి పడి గ్రామంలో కలకలం.

**చింతపల్లి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** మొంతా తుఫాన్ అల్లకల్లోలానికి గురిచేస్తోంది. బలమైన గాలి, వరుణ ప్రభావానికి పీఎం జన్మన్ పథకంలో నిర్మాణం కొనసాగుతున్న ఇళ్లపైనే భారీ చింతచెట్టు కూలిపోయి రాళ్లగడ్డ గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది. చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ పరిధిలోని రాళ్లగడ్డ గ్రామంలో మంగళవారం ఉదయం చెట్టు వేరుతో సహా పడిపోవడం తోపాటు విద్యుత్ స్తంభం విరగడంతో గ్రామం అంతా భయభ్రాంతులకు గురయ్యింది. ఈ ప్రమాదంలో గెమ్మెలి సన్యాసిరావు, సిందేరి రమణ కుటుంబాల కొత్త ఇండ్లు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. ఇంటి పక్కన ఆడుకుంటున్న చిన్నారులు, గృహాల్లో ఉన్న మహిళలు భయంతో బయటకు పరుగులు తీశారు. పైకప్పుపై పడి పూర్తిగా నేలమట్టం చేసే ప్రమాదం ఉన్నప్పటికీ పెద్ద ప్రమాదం జరుగకపోవడం ఊరికి ఉపశమనం కలిగించింది. చెట్టు, విద్యుత్ తీగలు ఒకేసారి కూలిన సమయంలో కరెంటు లేకపోవడం ప్రాణాపాయం తప్పించిందని గ్రామస్తులు తెలిపారు.

**కొత్త ఇళ్లు శిధిలాలు%కష్టాల్లో కూరుకున్న పేదరికం.**

పేదల ఆశకు నిలువుదోపిడిగా మారిన ఈ ఘటనతో ఇళ్ల గోడలు పగుళ్లు ఏర్పడి పైకప్పు శిధిలమయ్యాయి. నిర్మాణం పూర్తికావడానికి సన్నాహాల్లో ఉన్న ఇళ్లకు లక్షల్లో నష్టం జరిగినట్లు



బాధితులు వాపోయారు. ఇప్పటికే నిర్మాణ వ్యయంతో ఇబ్బందులు ముంచెత్తగా, ఇప్పుడు ఈ ప్రమాదం మళ్లీ మొదటి దశలోకి నెట్టేసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టు కింద చిక్కుకున్న పైపులు, గడపలు పూర్తిగా ధ్వంసమై పనులు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభం విరిగిపడడంతో గ్రామంలో రాత్రిపూట చీకటి చుట్టుముట్టింది. వైర్‌లు నేలపై వేలాడుతూ ఉండడంతో పిల్లలు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది.



**ప్రభుత్వం ఆదుకోవాలి%గ్రామస్తుల విజ్ఞప్తి.**

తక్షణమే అధికారులు వచ్చి చెట్టు తొలగింపు, నష్టం అంచనా, విద్యుత్ మరమ్మతులకు చర్యలు చేపట్టాలని సన్యాసిరావు, రమణ కోరుతున్నారు. పేదల కలలు ఛిద్రమవకుండా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, చెట్లు భారీగా పెరిగిన ప్రదేశాల్లో క్రమానుగత తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ పిల్లలతో ఇంట్లో ఉన్నాం. ఒక్కసారిగా చెట్టు గుమ్మం మీద పడి ఇంటే కూలిపోయినట్టయ్యింది. కరెంటు ఉన్నా ఎం జరిగేది? ఆలోచనకే వణుకు వంటుందని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.



# ఇంటిపై కూలిన చింత చెట్టు..

## వెంటనే స్పందించిన పోలీసులు!

### పనసలొద్దీ కుటుంబాన్ని ప్రాణాపాయంలోనుండి రక్షించిన ఎస్సై సురేష్ బృందం.



**చింతపల్లి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** గూడెంకొత్త వీధి మండలంలోని పనసలొద్దీ గ్రామంలో మంగళవారం పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. గ్రామానికి చెందిన కొర్ర పెద్దమ్మి ఇంటిపై ఎలాంటి సూచన లేకుండా భారీ చింత చెట్టు ఒక్కసారిగా విరిగిపడి కూలిపోయింది. ఈ సందర్భంగా ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే జీకే వీధి ఎస్సై కే. సురేష్, పోలీసు సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. స్థానికులతో కలిసి చెట్టును తొలగించి కుటుంబాన్ని సురక్షిత స్థితికి తీసుకువచ్చారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎస్సై తెలిపారు. సంక్షోభ సమయంలో వెంటనే స్పందించిన పోలీసుల సేవా భావాన్ని గ్రామస్తులు హర్షించారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గ్రామంలో ప్రమాదకర పాత చెట్లను గుర్తించి తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



ఎస్ యానాం వద్ద దాదాపు 20 మీటర్లు సముద్రం కోతకు గురి అయిన ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు



రాజోలు నియోజకవర్గంలో తుఫాను తీవ్రత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెబుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవర ప్రసాద్ ,టిడిపి ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య

# అధికారుల అలసత్వం.. చింతపల్లి చీకటి బందీ..

## తుఫానుకు ముందే అంధకారం.. సిద్ధత మాత్రం తర్వాతే!?

**చింతపల్లి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ప్రకృతి విపత్తు ముంచుకొస్తున్నప్పటికీ ముందస్తు సిద్ధతపై కన్నెత్తి చూడని విద్యుత్ శాఖ చర్యలు చింతపల్లిని చీకటి జైలులో నెట్టేశాయని ప్రజల ఆరోపణ. తుఫాను దెబ్బతో ఎప్పుడైనా లైట్లు ఆరిపోవచ్చని స్పష్టంగా తెలిసినా ముందే జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయకపోవడంతో పట్టణం పగలు రాత్రి తేడా లేకుండా చీకట్లోనే మునిగిపోయింది.



**తుఫాను రోజుల్లోనే పనుల్లేంటంటూ ప్రజల ప్రశ్న.**

కొండప్రాంతాల్లో చెట్లు, వెదురు బొంగులు విద్యుత్తు వైర్లపై వాలిపోతున్నాయని నెలలుగా స్థానికులు చెబుతున్నా చూడనట్టే చూసిన అధికారుల నిద్ర ఇప్పుడు వినియోగదారులపై పడింది. నర్సీపట్నం దగ్గర అడ్డంకులు తొలగిస్తున్నామంటూ చింతపల్లికి విద్యుత్ నిలిపివేశామని చెప్పే సాకును ప్రజలు తిప్పికొడుతున్నారు. ముందుగానే పనులు చేస్తే ఈ ఇబ్బందులు ఉండేవి కావు. ఏ పని చేసినా ప్రజలే బాధపడాలి అన్న ధోరణి ఎందుకు?" అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నీళ్ళు కూడా దొరక్క ఇళ్లలో ఓరిపాట.**

మోటార్లు, బోర్‌వెల్స్ ఆగిపోవడంతో తాగునీరు అరుదైపోయింది. మహిళల వేదన ఇలా ఉంది. నీళ్లు లేక పిల్లలు ఆహారం కోసం ఏడుస్తున్నారు. వండుకోవడానికి కూడా వీలు లేక ఇబ్బంది పడుతున్నాం.

**వ్యాపారాల నష్టాలపై కబురే లేదు.**

సగం వ్యాపారాలు విద్యుత్ ఆధారంగానే ఉన్నాయి. ఐస్ ప్లాంట్లు, మెషిన్ ఆధారిత దుకాణాలు నష్టాల వలయంలో చిక్కుకున్నాయి. వెన్నెలా వస్తుందో, లెక్కలు కరిగిపోతాయో తెలియడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి ఏడాది ఇదే కథ.. ఇక మార్పు ఎప్పుడంటే?**

తుఫాను సీజన్ రాగానే విద్యుత్ నిలిపివేత అనుభవం ప్రజలకు కొత్తకాదు. అదే నిర్లక్ష్యం, అదే ఇబ్బందులు. కార్యాచరణ మాత్రం శూన్యం. ప్రజల సమస్యలు ఎవరికి కనిపించవు. తప్పు జరిగిన తర్వాతే టీకాలు, సాకులు!" అని వినియోగదారులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.



**ప్రజల డిమాండ్ స్పష్టం.**

ముందస్తు చర్యలు తప్పనిసరి చేయాలని, అత్యవసర బృందాలను అన్ని ప్రాంతాలకు కేటాయించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, చింతపల్లి చీకట్లో మునిగిపోకుండా తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలనీ, అల్లూరి జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ప్రజల సమస్యల వెలుగును గ్రహించి వెంటనే పరిష్కారం చూపాలనే ఆకాంక్ష చింతపల్లి వినియోగదారుల్లో స్పష్టంగా వినిపిస్తోంది.



తెలుగురాష్ట్రం దినపత్రిక





గొల్లపల్లి వారి పేట లో పాక పైన పడిన కొబ్బరి చెట్టు బైక్ ధ్వంసం. తొలిగిస్తున్న సిబ్బంది





కాట్రేనికోన ఇండేన్ గ్యాస్ శివారు రోడ్ కి అడ్డంగా పడిపోయిన కరెంట్ స్తంభము,కొబ్బరి చెట్టు



### తుఫాను విపత్తును ఎదుర్కొనేందుకు

# ప్రతిష్ట చర్యలు

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట, వానపల్లి రావులపాలెం రావులపాడు పునరావాస కేంద్రాల పరిశీలన**



కొత్తపేట, అక్టోబర్ 28, (తెలుగు రాష్ట్రం)

మొంథా తుఫాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి రావులపాలెం మండలం రావులపాడు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రావులపాడు కేంద్రంలో స్థానికులతో పాటు రాయలసీమకు చెందిన పలువురు సంచార చిరు వ్యాపారుల కుటుంబాలు ఆశ్రయం పొందుతుండగా, ఎమ్మెల్యే వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రాల్లో భోజనం, వసతి, వైద్య సదుపాయాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆశ్రయం పొందుతున్న వారికి స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొంథా తుఫాను కాకినాడ%-%మచిలీపట్నం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీనివల్ల కోనసీమ జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట నియోజకవర్గాలపై తీవ్ర ప్రభావం ఉండే అవకాశముందని తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన ప్రజలను అక్కడికి తరలించినట్లు వివరించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం 111 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో కొత్తపేట మండలంలో 26 రావులపాలెం మండలంలో 42, ఆత్రేయపురం మండలంలో 21, ఆలమూరు మండలంలో 22, ఉన్నాయని తెలిపారు. ఇతర జిల్లాల ప్రజలు కూడా ఈ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారని, రావులపాడు కేంద్రంలో నంద్యాల జిల్లాకు చెందిన 90 కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే సత్యానందరావు ప్రజలకు సూచిస్తూ ం చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు తమ పశువులను కూడా సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. తుఫాను మంగళవారం రాత్రి తీరం దాటే అవకాశం ఉన్నందున అన్ని ముందస్తు చర్యలు పూర్తి అయ్యాయని, ప్రజలు నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని సూచిస్తూ, ఎవరికైనా సహాయం అవసరమైతే తాను నేరుగా 98492 43777, 80082 43777 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త పేట ఆర్డీవో పి. శ్రీకర్, కూటమి నాయకులు ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభి రామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లి భీమరావు, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్ పాల్గొన్నారు.

## మొంథా తుఫాను తీవ్రత పెరగడంతో కోనసీమలో అప్రమత్తం

### కొత్తపేట డివిజన్‌లో రవాణా, వాణిజ్య సేవలు నిలిపివేత

### అత్యవసర ఆదేశాలు జారీ చేసిన ఆర్డీఓ పి. శ్రీకర్

కొత్తపేట, అక్టోబర్ 28:( తెలుగు రాష్ట్రం)



మొంథా తుఫాను తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యవసర ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) పి. శ్రీకర్ మంగళవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు మధ్యాహ్నం నుంచి అత్యవసర మెడికల్ దుకాణాలు మినహా అన్ని రకాల వాణిజ్య దుకాణాలు, సముదాయాలు మూసివేయబడ్డాయి. మద్యం దుకాణాలు కూడా మూసివేయాలని ఆదేశించారు. అన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. గాలివేగం పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ఆర్డీఓ పి. శ్రీకర్ విజ్ఞప్తి చేశారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదం ఉన్నందున ప్రజలు రోడ్లపైకి రాకుండా, తమ పక్కా ఇళ్లలో లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలు రాబోయే 24 గంటల పాటు అక్కడే సురక్షితంగా ఉండాలని, తిరిగి ఇళ్లకు వెళ్లవద్దని ఆయన కోరారు. రోడ్లపై చెట్లు, స్తంభాలు కూలి అడ్డుగా పడిన చోట్ల తొలగింపు పనులకు ఆర్.అండ్.బి, ఫైర్, పంచాయితీ శాఖల అత్యవసర సిబ్బంది మాత్రమే పనిచేస్తారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటించి, అధికారులు అందిస్తున్న సహాయక చర్యలకు సహకరించాలని ఆర్డీఓ పి. శ్రీకర్ విజ్ఞప్తి చేశారు.

## కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### -కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి సమీక్ష



రాజమహేంద్రవరం, అక్టోబర్ 28(తెలుగురాష్ట్రం ప్రతినిధి):

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితులన్నైనా ఎదుర్కొనేందుకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అధికారులు సిద్ధంగా ఉన్నారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నగరంలో ఉన్న 142 కెమేరాలతో పరిస్థితిని అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఆర్ఎంసి హెల్ప్‌లైన్ కూడా 24/7 అందుబాటులో ఉందన్నారు. ఇప్పటివరకు ఏడు ఫిర్యాదులు రాగా మూడు పరిష్కరించారని, మరొక 4 ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. చెట్లు పడిపోవడం, నీరు నిలిచిపోవడం వంటి విషయాలపై ఈ ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటయ్యాయని ఎటువంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే పరిష్కరిస్తారన్నారు. నీట మునిగే ప్రాంతాలు గుర్తించారని, గత రెండ్రోజులుగా ఆయా ప్రాంతాల్లో డిసిల్టింగ్ ప్రక్రియ చేపట్టామన్నారు. హుద్ హుద్ తుఫాన్ సమయంలో మురికినీరు తరలింపునకు గంట నుంచి గంటన్నర వరకు సమయం పట్టేదని, ఇప్పుడు నల్లా చానల్ వద్ద అదనపు మోటార్లు ఏర్పాటు చేయడం, కోటిలింగాల పేట వద్ద కోటిరన్న సిఎస్ఆర్ నిధులతో పంప్‌హౌస్ నిర్మాణం, జనరేటర్ ఏర్పాటు చేయడం వల్ల అరగంటలోనే క్లియర్ అవుతోందన్నారు. తుఫాన్ తీరం దాటే వరకు అధికారులతో పాటు కూటమి నాయకులు వారికి అందుబాటులో నేను కూడా సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఇళ్లలోనే ఉంటూ సురక్షితంగా ఉండాలని సూచించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో వీచే తీవ్రమైన గాలుల వల్ల రేకులు ఎగిరిపడటం, చెట్లు, విద్యుత్ తీగలు తెగిపడటం జరుగుతుందని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి రావద్దని ప్రజలకు సూచించారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, రజక కమ్యూనిటీ హాల్, పందిరి మహాదేవుడు సత్రాల్లో ఎంసిఆర్ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 150 ఇళ్ల వరకు శిథిల స్థితిలో ఉన్న వాటిని అధికారులు గుర్తించి నోటీసులు ఇచ్చారని, వారు కూడా పునరావాస కేంద్రాలకు వస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మరొక రెండ్రోజల వరకు ప్రజలు తమ ఇళ్లలో మంచినీరు, పాలు, బిస్కెట్లు ఇతర నిత్యావరాలు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు యాళ్ల ప్రదీప్, తంగెళ్ల బాబీ, కరగాని వేణు, కేలం శ్రీనివాస్, ఆర్ఎంసి అదనపు కమీషనర్ పివి రామలింగేశ్వర్ ఇతర అధికారులు ఉన్నారు.

## పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం

### -శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేకరి):



రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతన్నలు నష్టపోకుండా చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులెవ్వరు అధైర్యపడోద్దని సూచించారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, ప్రజలు సురక్షితమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఏదైనా అత్యవసరమైతే ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ లకుగాని, తమకు గాని ఫోన్ చేసి సమాచారం అందిస్తే, తక్షణమే రక్షణ చర్యలు చేపడతామని చెప్పారు. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నియోజక సంసిద్ధంగా ఉన్నారన్నారు. అధికారులందరు ఆయా శాఖల తరపున అప్రమత్తమై గ్రామస్థాయిలోనూ, వార్డు స్థాయిలోనూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 14 నుంచి 15 లారీల ధాన్యాన్ని (138 టన్నులు) ఇప్పటికే మిల్లులకు తరలించి, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నెలలు నిండిన 13 మంది గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రులో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు. తుఫానుకు సంబంధించి ఏ అత్యవసరమైన పరిస్థితి ఉన్న వెంటనే క్యాంపు కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు.

**చెక్కులు పంపిణీ**

మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన బండారు కనకరాజు వారి కుమారుడు బండారు జస్వంత్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ, మండలస్థాయి జనసేన నాయకులు శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బండారు కనకరాజుకి రూ. 1,22,119/, బండారు జస్వంత్ కి రూ. 1, 50,000 వెరసి మొత్తం రూ. 2,72,119 చెక్కులను శాసనసభ్యులు బాధితులకు అందజేశారు. తమ జీవితాంతం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు రుణపడి ఉంటామని తండ్రీ కొడుకులు వివరించారు.

## ర్యాలి గ్రామం హై- స్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు

### ఇంటింటికి వెళ్ళి పునరావాస కేంద్రానికి తరలి రావాలని వినతి.

ఆత్రేయపురం అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం)



ఆత్రేయపురం – మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో ఎమ్మెల్యే బండారు పిలుపును దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండేలా ముందస్తు చర్యల్లో భాగంగా ఆత్రేయపురం మండలంలోని మేజర్ పంచాయతీ ర్యాలి గ్రామంలో కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది కలిసి మంగళవారం ఉదయం నుండి లోతట్టు ప్రాంతాల్లో, రేకుల షెడ్లు, తాటాకు ఇళ్లలో నివాసం ఉండే వారి ఇంటింటికి వద్దకు వెళ్ళి తుఫాను తీవ్రత కోసం వివరించారు. తుఫాను తీరం దాటే సమయంలో, దాటిన తర్వాత అత్యంత వేగంగా గాలులు వీయనున్నాయని, వర్షపాతం అత్యధికంగా నమోదు కానున్నందున ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలి రావాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామని, భోజనాలు, పడుకోవడానికి రూమ్లు, బాత్రూములు మొదలైన సదుపాయాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ పునరావాస కేంద్రం వద్ద విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ మెంబర్ పాలింగి రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి సాయిరాం రెడ్డి, విఆర్ఓ ఉదయ్, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు బందెల వెంకన్న, ,గుండెల నాగేంద్ర, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లకల్లోలంగా సముద్రం...

**కాకినాడ పోర్టుకు ఏడో ప్రమాద హెచ్చరిక.. హై అలర్ట్ లో పోర్టులు**

**తీరం దిశగా దూసుకొస్తున్న మొంథా తుపాను**

**తీరం దాటే సమయంలో 110 కి.మీ వేగంతో వీయనున్న గాలులు**

**పోర్టులకు అలర్ట్ జారీ చేసిన వాతావరణ కేంద్రం**



అమరావతి, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ఉత్తర – వాయవ్య దిశగా కదులుతూ మచిలీపట్నం, కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీయనున్నాయి. ఇప్పటికే సముద్రం అల్లకల్లోలంగా ఉంది. బలమైన అలలు తీరంపై విరుచుకు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తుపాను తీవ్రత పెరుగుతుండటంతో ఏపీలోని పోర్టులను విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అలర్ట్ చేసింది. కాకినాడ పోర్టుకు ఏడో ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. విశాఖపట్నం, గంగవరం పోర్టులకు ఆరో ప్రమాద హెచ్చరికనుబీ మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టులకు ఐదో ప్రమాద హెచ్చరికను జారీ చేసింది.

## కాకినాడ పోర్టుకు ఏడో ప్రమాద హెచ్చరిక

కాకినాడ, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



: మొంథా తుపాను తీరం వైపు దూసుకొస్తోంది. దీని ప్రభావంతో ఏపిలోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని పోర్టులకు హెచ్చరికల స్థాయిని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం పెంచింది. కాకినాడ పోర్టుకు ఏడో ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. విశాఖపట్నం, గంగవరం పోర్టులకు ఆరు, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టుకు ఐదో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

## రంపచోడవరం కేంద్రంగా కొత్త ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలి

### -ఆదివాసి గిరిజన సంఘం




వి ఆర్ పురం, అక్టోబర్ 28 (తెలుగురాష్ట్రం విలేఖరి):

రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే నూతన జిల్లాల్లో రంపచోడవరం కేంద్రంగా నూతన ఏజెన్సీ జిల్లాను ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంగా ఉన్న పాడేరు వెళ్లాలంటే విలీన మండలాల ప్రజలు, రంపచోడవరం నియోజకవర్గ ప్రజలు దూరభారం వలన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీని వలన సమస్యల పరిష్కారం కూడా జాప్యం జరుగుతుందని, కలెక్టర్ ని కలవాలన్న వెళ్ళి కలవలేని పరిస్థితుల్లో ప్రజలు ఉంటున్నారని ఆయన తెలిపారు. ఒకపక్క పోలవరం ప్రాజెక్టు వలన తీవ్రంగా నష్టపోతున్న ఎటపాక, కూనవరం, విఆర్ పురం, చింతూరు, దేవీపట్నం మండలాల ప్రజలు నిర్వాసితుల సమస్యల పరిష్కారం గాక ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుతం రంపచోడవరంలో ఉన్న ఏడు మండలాలను, విలీన మండలాలైన నాలుగు మండలాలను, ఏలూరు జిల్లాలోని నాలుగు మండలాలను, నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను కలుపుతూ రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడం వలన నిర్వాసితుల సమస్యలు త్వరగా పరిష్కారం అవ్వడానికి అవకాశం ఉంటుందని అన్నారు. తక్షణమే నూతన జిల్లాల ప్రతిపాదనలో రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పూనెం ప్రదీప్ కుమార్, పొడియం శ్రీరామ్మూర్తి, తుర్రం బాబురావు, మిడియం సీతయ్య, గొర్రె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లిలో 27.4 మి.మీ. వర్షపాతం నమోదు.

### 'మొంతా' ప్రభావం...రోడ్లు జలమయం.

చింతపల్లి, అక్టోబర్ 28 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):




పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంతా' తుఫాను ప్రభావంతో చింతపల్లి మండలమంతా మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షబీభత్సం నెలకొంది. మండల కేంద్రంతో సహా పలు గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో రహదారులు చెరువుల్లా మారిపోయాయి. మండల కేంద్రంలో 27.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారి ఆళ్ల అప్పలస్వామి వెల్లడించారు. వర్షం కారణంగాఏజెన్సీ ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లాయి. పల్లెల మధ్య రవాణా నిలిచిపోయింది. కొండచరియలు యథేచ్ఛగా జారిపడే ప్రమాదం ఉందని అటవీ పరిసర గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో చెట్లు విరిగిపడి నివాస గృహాలపై పడ్డాయి. పంటపొలాల్లో నీరు నిలిచిపోవడంతో నాటు వరి, కంది, మిర్చి పంటలకు లేయింగ్ సమస్య వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే సమాచారం ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయం ప్రజలకు సూచించింది. వర్ష ప్రభావం కొనసాగవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే గృహాల్లోనే ఉండాలని అధికార యంత్రాంగం సూచించింది.

# ఛాంపియన్ ప్లేయర్‌కు మరోసారి షాక్..

## తొలి టీ20ఐ నుంచి ఔట్..



**యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా కూడా తుది జట్టులో చోటు దక్కడం కష్టమేనని తెలుస్తోంది. ఇటీవల దేశవాళీ క్రికెట్, వన్డే సిరీస్‌లలో మంచి ప్రదర్శన చేసినప్పటికీ టీ20 ఫార్మాట్‌లో సీనియర్ పేసర్‌లకు ప్రాధాన్యత ఇచ్చేట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ముఖేష్ కుమార్ వంటి పేసర్లు తుది జట్టులో ఉండే అవకాశం ఉంది.**

భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌లో తొలి పోరుకు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 29న కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్‌లో జరగనున్న ఈ మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న యువ భారత జట్టుకు ఇది కీలక పరీక్ష కానుంది. ఈ నేపథ్యంలో, తొలి టీ20ఐకి భారత తుది జట్టు (ప్లేయింగ్ %శ×%) ఎలా ఉండబోతుందనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా, స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్కు మరోసారి చోటు దక్కకపోవడం, యువ పేసర్ హర్షిత్ రాణా కూడా తప్పించాలని మాజీలు కోరుతున్నారు.

### కుల్దీప్‌కు మళ్లీ నిరాశ..

వన్డే ఫార్మాట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నప్పటికీ, టీ20ఐ ఫార్మాట్‌లో కుల్దీప్ యాదవ్‌కు నిలకడగా తుది జట్టులో చోటు దక్కడం లేదు. ఆస్ట్రేలియాతో జరిగిన గత టీ20ఐ సిరీస్‌లలో కూడా అతనికి తరచుగా విశ్రాంతినిస్తున్నారు. కాన్‌బెర్రా పిచ్ స్వభావం, జట్టు కూర్పు దృష్ట్యా, మేనేజ్‌మెంట్ మణికట్టు స్పిన్నర్ అయిన కుల్దీప్‌కు బదులు వేరే స్పిన్ ఎంపికల వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అక్షర్ పటేల్ అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే. దీంతో, కుల్దీప్ యాదవ్‌కు బెంచ్‌కే పరిమితం కాక తప్పలేదు.

### హర్షిత్ రాణాకు నిరాశ..

యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా కూడా తుది జట్టులో చోటు దక్కడం కష్టమేనని తెలుస్తోంది. ఇటీవల దేశవాళీ క్రికెట్, వన్డే సిరీస్‌లలో మంచి ప్రదర్శన చేసినప్పటికీ టీ20 ఫార్మాట్‌లో సీనియర్ పేసర్‌లకు ప్రాధాన్యత ఇచ్చేట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, ముఖేష్ కుమార్ వంటి పేసర్లు తుది జట్టులో ఉండే అవకాశం ఉంది. హర్షిత్ రాణా భవిష్యత్తులో మంచి అవకాశాలు దక్కించుకునే అవకాశం ఉన్నా, ప్రస్తుతానికి అతనికి బెంచ్‌లో కూర్చోవాల్సి వచ్చింది.

**పెర్త్ వన్డే తర్వాత రిటైర్మెంట్..**
**షాకిచ్చిన 36 ఏళ్ల భారత ఆటగాడు..**

ఈ క్రమంలో టీమిండియా మాజీ ప్లేయర్ పార్థివ్ పటేల్ టీమిండియా ప్లేయింగ్ 11ను ఎంచుకున్నాడు. కేవలం ఇద్దరు స్పిన్నర్లను సూచించాడు. ఆల్ రౌండర్ అక్షర్ పటేల్, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎంచుకున్నాడు. అలాగే, శివం దుబే, నితీష్ కుమార్ రెడ్డి రూపంలో ఇద్దరు పేస్-బౌలింగ్ ఆల్-రౌండర్లతో నిండిన లైనప్‌తో వెళ్లాలని తెలిపాడు. ఇటీవల టీ20ఐలలో బరిలోకి దిగిన టాప్ ఆర్డర్‌తోనే పార్థివ్ కొనసాగాలని సూచించాడు. ఇందులో అభిషేక్ శర్మ , వైస్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, తిలక్ వర్మ , కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఉన్నారు. అతను ఇద్దరు ఫ్రంట్‌లైన్ పేసర్లను కూడా ఎంచుకున్నాడు. పేస్ స్పియర్‌హెడ్ జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లను ఎంచుకున్నాడు. అయితే, సిడ్నీలో జరిగిన మూడవ వన్డేలో భారత జట్టు విజయంలో నాలుగు వికెట్లు తీసిన హర్షిత్ రాణాను పక్కన పెట్టాడు. రింకు సింగ్ , జితేష్ శర్మ వంటి ఆటగాళ్లకు కూడా పార్థివ్ జట్టులో చోటు దక్కలేదు. పార్థివ్ పటేల్ ఎంపిక చేసిన తొలి టీ20కి భారత ఎలెవన్ అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి , అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

# శ్రేయస్ అయ్యర్ స్థానంలో ఎవరు?

## సౌతాఫ్రికా సిరీస్ కోసం పోటీ పడుతున్న ముగ్గురు ప్లేయర్లు



**టీమిండియా స్టార్ బ్యాట్స్‌మెన్ శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియాతో జరిగిన మూడవ వన్డేలో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు తీవ్రంగా గాయపడ్డారు. అతనికి తీవ్ర గాయమైంది. ప్రస్తుతం అతను సిడ్నీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బీసీసీఐ వైద్య బృందం అయ్యర్ పరిస్థితి నిలకడగా ఉందని ధృవీకరించింది.**

టీమిండియా స్టార్ బ్యాట్స్‌మెన్ శ్రేయస్ అయ్యర్ ఆస్ట్రేలియాతో జరిగిన మూడవ వన్డేలో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు తీవ్రంగా గాయపడ్డారు. అతనికి తీవ్ర గాయమైంది. ప్రస్తుతం అతను సిడ్నీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బీసీసీఐ వైద్య బృందం అయ్యర్ పరిస్థితి నిలకడగా ఉందని ధృవీకరించింది. అయితే కోలుకోవడానికి సమయం పట్టవచ్చు. ఈ నేపథ్యంలో నవంబర్ 30 నుండి ప్రారంభమయ్యే సౌతాఫ్రికా వన్డే సిరీస్కు అతడు ఆడడం అనుమానంగా ఉంది. జట్టులో అయ్యర్ స్థానాన్ని భర్తీ చేయడానికి సంజు శాంసన్ పేరు ముందుంది. శాంసన్ ఇప్పటివరకు ఆడిన 16 వన్డే మ్యాచ్‌లలో 56.66 సగటుతో 510 పరుగులు చేశాడు. అతని పేరు మీద ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు కూడా నమోదయ్యాయి. సంజు శాంసన్‌కు ఆస్ట్రేలియా సిరీస్‌లో అవకాశం లభించలేదు. కానీ ఇప్పుడు నంబర్-4 స్థానం ఖాళీగా ఉన్నందున, అతను ఈ స్లాట్‌కు సరిగ్గా సరిపోతాడు. సంజు శాంసన్ సహజంగానే దూకుడుగా ఆడతాడు. కానీ అతను ఇన్నింగ్స్‌ను చక్కదిద్దడంలో కూడా నిపుణుడు. అతని వికెట్ కీపింగ్ కెపాసిటీ జట్టుకు బోనస్ కావచ్చు. తిలక్ వర్మ ఇటీవల కాలంలో టీమిండియాలో వృద్ధిలోకి వస్తున్న స్టార్ ప్లేయర్. అతను ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్ పై అద్భుతమైన బ్యాటింగ్ చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. అయితే, వన్డేలలో అతని అనుభవం ఇంకా తక్కువే. ఇప్పటివరకు అతను నాలుగు మ్యాచ్‌లలో 68 పరుగులు చేశాడు, కానీ అతని ఆత్మవిశ్వాసం, స్ట్రైక్ రొటేషన్ అతన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి. టీమ్ మేనేజ్‌మెంట్ అతనికి అవకాశం ఇస్తే అతను నంబర్-4 లో జట్టుకు స్థిరత్వాన్ని అందించగలడు.

ఈ పోటీలో రియాన్ పరాగ్?ను కూడా విస్మరించలేం. పరాగ్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో కూడా తన వంతు సహకారం అందించగలడు. అతను భారతదేశం తరఫున ఒక వన్డే, తొమ్మిది టీ20లు ఆడాడు. అతని దేశీయ ప్రదర్శన అద్భుతంగా ఉంది. అతను జట్టుకు బ్యాలెన్స్ ఆప్షన్ ఇవ్వగలడు. జట్టుకు అదనపు బౌలర్ అవసరమైతే పరాగ్ ఒక బెస్ట్ ఆప్షన్?గా నిరూపించుకోవచ్చు.



# తుఫాను బాధితులకు మందేశ్వర స్వామి దేవస్థానం భోజన సేవ

## పునరావాస కేంద్రంలో భోజన వసతి ఃగోశాలలో ఆవులకు దానాలు

కొత్తపేట, అక్టోబర్ 28:( తెలుగు రాష్ట్రం )

మొంథా తుఫాను ప్రభావంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలంలోని పలు గ్రామాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. తుఫాను కారణంగా ఇళ్లకు నష్టం వాటిల్లిన కుటుంబాల కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో మందపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున భోజన వసతి ఏర్పాటు చేశారు. స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు గారి ఆదేశాల మేరకు దేవస్థానం ప్రతినిధులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. తుఫాను కారణంగా ఇళ్లను వీడి కేంద్రాలకు తరలివచ్చిన బాధితులకు ఉదయం, సాయంత్రం భోజన సదుపాయం అందిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని దేవస్థానం మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సిద్ధంశెట్టి సత్యనారాయణ పర్యవేక్షించారు. అంతేకాకుండా, మందేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని గోశాలలో ఉన్న ఆవులకు ప్రత్యేక దాన కార్యక్రమం నిర్వహించారు. గోసాల సిబ్బందితో కలిసి ఆవులకు పచ్చిపొట్టు, నీరు, ఆహారం అందజేశారు. తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గేవరకు దేవస్థానం తరఫున సేవా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని సిద్ధంశెట్టి సత్యనారాయణ తెలిపారు. ప్రజలు సురక్షితంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను కచ్చితంగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# వానపల్లిలో తుఫాను ప్రభావం తీవ్రం

**ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని అధికారులు విజ్ఞప్తి**
**సహాయక చర్యల్లో కూటమి నాయకులు - పునరావాస కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ పల్లి బీమరావు**








కొత్తపేట, అక్టోబర్ 28:( తెలుగు రాష్ట్రం)

మొంథా తుఫాను ప్రభావంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వానపల్లి గ్రామ పరిధిలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గాలివాన కారణంగా పలు చోట్ల పాకలు, షెడ్లు దెబ్బతిన్నాయి. భారీ గాలులు, వర్షాల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు రోడ్లపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పాకలు, షెడ్లలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి ఉండాలని అధికారులు సూచించారు. వానపల్లి పరిధిలో చెట్లు, స్తంభాలు కూలిన చోట్ల తొలగింపు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ సహాయక చర్యల్లో కూటమి నాయకులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజలకు అవసరమైన ఆహారం, త్రాగునీరు, వైద్య సేవలను అందించేందుకు స్థానిక అధికారులు సమన్వయం చేస్తున్నారు. ఇక సంగంపాలెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తుఫాను బాధితుల పునరావాస కేంద్రాన్ని వానపల్లి సర్పంచ్ పల్లి బీమరావు సందర్శించారు. బాధితుల వద్ద ఆరా తీసి, వారికి అవసరమైన సదుపాయాలపై సూచనలు చేశారు. ప్రజలు తుఫాను తీవ్రత తగ్గేవరకు పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అన్ని విభాగాలను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టిందని సర్పంచ్ పల్లి బీమరావు తెలిపారు. గ్రామ ప్రజల ప్రాణ భద్రతే తమకు ప్రధానమని పేర్కొన్నారు.

# ఆలమూరు ఎస్సై జి. నరేష్ ఆధ్వర్యంలో హుటాహుటిన జొన్నాడ వద్ద రహదారిపై సహాయక చర్యలు



ఆలమూరు అక్టోబర్ 28( తెలుగు రాష్ట్రం )



మొందా తుఫాన్ ప్రభావంతో ఆలమూరు మండల పరిధిలో మంగళవారం సాయంత్రం పలు చోట్ల ఈదురు గాలులు వీచి చెట్లు నేలకొరిగాయి. ముఖ్యంగా జొన్నాడ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై పడిన చెట్లు వాహనాల రాకపోకలకు పెద్ద ఆటంకంగా మారాయి. ఈ సమాచారం అందుకున్న ఆలమూరు పోలీసు స్టేషన్ ఎస్సై జి. నరేష్ సిబ్బందితో కలిసి తక్షణమే అక్కడికి చేరుకుని ప్రతికూల పరిస్థితులు లెక్కచేయకుండా శ్రమించి చెట్లను తొలగించి రహదారిని శుభ్రం చేశారు. దీంతో వాహనాల రాకపోకలు మళ్లీ సజావుగా కొనసాగాయి.

ఎస్సై జి నరేష్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కొనసాగుతున్నందున ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావొద్దని సూచించారు. రహదారిపై ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర స్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. తుఫాన్ కారణంగా ఎక్కడా పెద్ద ప్రమాదాలు జరగకపోవడం సంతోషకరమని ఎస్సై నరేష్ పేర్కొన్నారు. ఈ చర్యలతో రహదారి రాకపోకలు పూర్తిగా సాధారణ స్థితికి చేరగా, ప్రజలు పోలీసుల చురుకైన చర్యలను అభినందించారు.

# తుఫాన్ సమయంలో ప్రజలకు భరోసా..

## కమిషనర్ నిర్మల్ కుమార్ సేవా స్ఫూర్తి..



తెలుగు రాష్ట్రం, అమలాపురం

మొంథా తుఫాన్ కారణంగా పట్టణంలో వర్షం, ఈదురుగాలులు కొనసాగుతున్నా మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ ప్రజల మధ్యకు వెళ్లి వారిని ఆదరిస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వార్డులలో తిరుగుతూ ప్రజలను ధైర్యం చెప్పి, తక్షణ చర్యలు చేపడుతున్నారు. తుఫాన్ కారణంగా రోడ్లపై పడిపోయిన చెట్లను జేసీబీలతో వెంటనే తొలగిస్తూ, రాకపోకలు సులభం చేస్తున్నారు. వార్డుల్లో స్వయంగా పర్యటించి మున్సిపల్ సిబ్బందితో కలిసి చెట్ల తొలగింపు పనులను పర్యవేక్షించారు. ప్రజల భద్రత కోసం అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని కౌన్సిలర్ యేడిద శ్రీను తెలిపారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# బాక్సాఫీస్‌ను దున్నేస్తున్న 'కాంతార ఛాప్టర్ 1'..

**నెల రోజుల్లో రూ.852 కోట్ల వసూళ్లు**
**కాంతార 1' వసూళ్ల సునామీ**
**రిషబ్ శెట్టి నటన, దర్శకత్వానికి ప్రశంసల వెల్లువ**
**దైవత్వం, జానపద కథాంశంతో ప్రేక్షకులను కట్టిపడేస్తున్న సినిమా**
**అసలు 'కాంతార' వసూళ్లను రెట్టింపు చేసిన ప్రీక్వెల్**
**అక్టోబర్ 31న ఇంగ్లీష్‌లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు**

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార ఛాప్టర్ 1' బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. పండుగ సీజన్‌లో విడుదలై, కేవలం నెల రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.852 కోట్ల వసూళ్లను దాటి సరికొత్త రికార్డు నెలకొల్పింది. 2022లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. అక్టోబర్ 2న విడుదలైన ఈ సినిమా, దైవత్వంతో ముడిపడిన కథనంతో సినీ ప్రియులను కట్టిపడేస్తోంది. క్రీ.శ. 4వ శతాబ్దం నాటి కథాంశంతో, కాంతార అనే పవిత్ర భూమి మూలాలను వివరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విశ్వాసం, అధికారం, దైవ ప్రతీకారం వంటి అంశాలతో సాగే ఈ గాథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతోంది. అరవింద్ ఎస్. కశ్యప్ సినిమాటోగ్రఫీ, అజనీష్ లోక్‌నాథ్ నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని విమర్శకులు, ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. హెూంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, రుక్మిణి వసంత్, జయరాం, ప్రకాశ్ తుమ్మినాడు వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే అసలు 'కాంతార' సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్లను రెట్టింపు చేసి, అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో చేరిపోయింది. దేశవిదేశాల్లోని థియేటర్లు ఇప్పటికీ ప్రేక్షకులతో కిటకిటలాడుతున్నాయి. జానపద కథలు, ఆధ్యాత్మికతను మేళవించి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ చిత్రాన్ని ఇప్పుడు గ్లోబల్ ఆడియన్స్‌కు మరింత చేరువ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 31న 'కాంతార ఛాప్టర్ 1' ఆంగ్ల వెర్షన్‌ను విడుదల చేయనున్నారు. ఈ విజయంతో భారతీయ సినిమా కథలు హద్దులు దాటి ప్రేక్షకులను మెప్పించగలవని మరోసారి రుజువైంది.

# నేను శ్రీదేవిని కాను... నా శరీర ఆకృతి వేరు: శ్రీలీల



**ఒక్కసారిగా స్లిమ్‌గా మారిన యంగ్ హీరోయిన్ శ్రీలీల**
**ఫుడ్ కంట్రోల్ వల్లే సన్నబడ్డానని వెల్లడి**
**అమ్మమ్మ పంపే అరిసెలు, బజ్జీలు తినడం మానేశానన్న నటి**

టాలీవుడ్‌లో యువ కథానాయికగా దూసుకుపోతున్న శ్రీలీల ఇటీవల తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎప్పుడూ చలాకీగా కనిపించే ఈ బ్యూటీ, ఉన్నట్టుండి మరింత నాజూగ్గా మారడంతో సోషల్ మీడియాలో ఆమె కొత్త ఫొటోలు వైరల్ అయ్యాయి. దీనిపై అభిమానుల నుంచి వస్తున్న కామెంట్ల నేపథ్యంలో, తన స్లిమ్ లుక్ వెనుక ఉన్న రహస్యాన్ని శ్రీలీల స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. తాను ఈ మధ్య ఆహార నియంత్రణపై దృష్టి పెట్టినట్లు శ్రీలీల తెలిపింది. "గతంలో అమ్మమ్మ ఒంగోలు నుంచి అరిసెలు పంపిస్తే ప్యాకెట్ ఖాళీ అయ్యేవరకూ తినేదాన్ని. చెకోడీలు, బజ్జీలు కూడా బాగా తినేసేదాన్ని. ఇప్పుడు వాటన్నింటినీ తగ్గించాను. సరైన ఆహారం తీసుకోవాలని నిర్ణయించుకున్నాను" అని నవ్వుతూ చెప్పింది. ఇంతలా సన్నబడటంతో చాలామంది ఆమెను అలనాటి అందాల తార శ్రీదేవితో పోలుస్తున్నారు. ఈ విషయంపై శ్రీలీల స్పందిస్తూ, "నేను శ్రీదేవిని కాదు. ప్రతి ఒక్కరి శరీరాకృతి వేరుగా ఉంటుంది. నా శరీరం గురించి నాకు బాగా తెలుసు. పైగా నేను ఒక డాక్టర్‌ని కూడా" అని స్పష్టం చేసింది. ప్రేక్షకులు డబ్బులు పెట్టి థియేటర్‌కు వస్తున్నప్పుడు వారికి ఉత్తమంగా కనిపించడం తన బాధ్యత అని, అందుకే తన లుక్‌పై శ్రద్ధ తీసుకుంటున్నానని వివరించింది. ఇక తన సినిమాల గురించి మాట్లాడుతూ, ప్రస్తుతం విభిన్నమైన పాత్రలు చేస్తున్నట్లు శ్రీలీల తెలిపింది. 'మాస్ జాతర'లో తన పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుందని, మాస్ అంశాలతో పాటు కామెడీ కూడా ఉంటుందని చెప్పింది. మొత్తానికి, తన స్లిమ్ లుక్‌తో పాటు, ఆరోగ్యంపై స్పష్టమైన అవగాహనతో శ్రీలీల ఇస్తున్న సమాధానాలు అభిమానులను మరింతగా ఆకట్టుకుంటున్నాయి.



# 'ఫౌజీ'లో జూనియర్ ప్రభాస్‌గా దర్శన్

ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా 'ఫౌజీ'.దర్శకుడు హను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తోంది. చైత్ర జె ఆచార్ కథానాయిక.నటుడు సుధీర్‌బాబు రెండో కుమారుడు దర్శన్ ఈ సినిమాతో ఎంట్రీ ఇస్తున్నాడు. దర్శన్ కథానాయకుడు మహేష్‌బాబు మేనల్లుడు కూడా. మహేష్‌బాబు నిర్మిస్తున్న గూఢచారి-2లో కూడా దర్శన్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారని సమాచారం. సుధీర్‌బాబు ఇప్పటికే తన పెద్ద కుమారుడు చరిత్ మానస్‌ను వెండితెరకు పరిచయం చేశారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మోసగాళ్లకు మోసగాడు' కూడా ఓ చిన్న పాత్రలో చరిత్ నటించాడు. గతంలో తను పలు సినిమాల్లో మెరిశాడు. భలే మగాడివోరు సినిమాలో జూనియర్ నానిగా కనిపించారు. మహేష్‌బాబు తనయుడు గౌతమ్ కూడా 1 నేనొక్కడినే' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఇప్పుడు సుధీర్‌బాబు రెండో కుమారుడు దర్శన్ ఏకంగా ప్రభాస్ పాన్ ఇండియా చిత్రంతో ఎంట్రీ ఇవ్వనున్నాడు.

# మార్చి 19న 25న 'డకాయిట్' విడుదల

%కథానాయకుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డకాయిట్'. ఇప్పటికే సినిమా విడుదల తేదీలు ప్రకటించిన వాయిదాలు పడుతూ వస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ నుంచి కోలీవుడ్ భామ శృతిహాసన్ అనూహ్యంగా తప్పుకున్నారు. ఇది కూడా సినిమా ఆలస్యానికి కారణమైంది. ఆ తర్వాత సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ కథానాయికగా చేస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. అనివార్య కారణాలతో వాయిదాపడటంతో వచ్చే



ఏడాది ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అడివి శేష్ నటించిన 'క్షణం', గూఢచారితో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామెన్‌గా చేసిన షానీల్ డియో ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ గ్లింప్స్ సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్‌లో ఉన్నాయి.

## 'కాంతార' మాయావి రహస్యం వీడింది..

# ఆ పాత్రలోనూ రిషబ్ శెట్టే!

**బయటకొచ్చిన మేకింగ్ వీడియో.. 6 గంటల పాటు మేకప్**
**రిషబ్ డెడికేషన్‌ను ప్రశంసిస్తున్న అభిమానులు**
**సినిమాకు 25 రోజుల్లోనే 800 కోట్లకు పైగా వసూళ్లు**
**మరోసారి జాతీయ అవార్డు ఖాయమంటున్న విశ్లేషకులు**



'కాంతార చాప్టర్ 1' చిత్రంలో అందరినీ ఆశ్చర్యపరిచిన మాయావి (మాయ కర) పాత్రలో ఎవరు నటించారనే ఉత్కంఠకు తెరపడింది. ఆ కీలక పాత్రను కూడా హీరో రిషబ్ శెట్టే పోషించారని నిర్మాణ సంస్థ హెూంబలే ఫిలిమ్స్ అధికారికంగా ప్రకటించింది. బెర్మే పాత్రలో అద్భుత నటనతో జాతీయ అవార్డు అందుకున్న రిషబ్, ఇప్పుడు మాయావి పాత్రలోనూ కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఈ మేరకు హెూంబలే ఫిలిమ్స్ ఓ ప్రత్యేక మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో రిషబ్ శెట్టి మాయావి పాత్ర కోసం మేకప్ వేయించుకుంటున్న దృశ్యాలు ఉన్నాయి. ఆ పాత్ర కోసం ఆయన దాదాపు 6 గంటల పాటు కదలకుండా కుర్చీలో కూర్చోవాల్సి వచ్చింది. తెల్లవారుజామున 3 గంటలకే సెట్‌కు చేరుకుని, ఉదయం 9 గంటల వరకు మేకప్ ప్రక్రియ కొనసాగేదని నిర్మాణ సంస్థ తెలిపింది. ఈ వీడియో చూసిన ప్రేక్షకులు, అభిమానులు రిషబ్ శెట్టి అంకితభావానికి ఫిదా అవుతున్నారు. ఈ సినిమాలో బెర్మే, మాయావి అనే రెండు విభిన్న పాత్రలను రిషబ్ పోషించారు. రెండు పాత్రల మధ్య ఆయన చూపిన వైవిధ్యం అద్భుతమని విమర్శకులు ప్రశంసిస్తున్నారు. ఈ స్థాయిలో నటన కనబరిచినందుకు ఆయనకు మరోసారి జాతీయ అవార్డు రావడం ఖాయమని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. "ఆ పాత్రను రిషబ్ కాకుండా మరెవరూ చేయలేరు" అని సినీ ప్రముఖులు సైతం అభిప్రాయపడుతున్నారు. నటన పరంగానే కాకుండా, 'కాంతార చాప్టర్ 1' బాక్సాఫీస్ వద్ద కూడా రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 25 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి సత్తా చాటింది. కన్నడతో పాటు తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలోనూ ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. ఈ చిత్రంలో రిషబ్ శెట్టికి జోడీగా రుక్మిణీ వసంత్ (కనకవతి) నటించగా, కీలక పాత్రల్లో జయరామ్, గుల్షన్ దేవయ్య కనిపించారు. అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం అందించిన ఈ సినిమాను హెూంబలే ఫిలిమ్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించింది.

# నాకు డబ్బు ముఖ్యం కాదు: ప్రియమణి

**హీరోల కంటే తక్కువ పారితోషికం తీసుకున్నా బాధపడలేదన్న ప్రియమణి**
**డబ్బు కంటే మంచి పాత్రకే తన మొదటి ప్రాధాన్యత అని వ్యాఖ్య**
**పాత్రకు అర్హురాలిని అనిపిస్తేనే రెమ్యూనరేషన్ డిమాండ్ చేస్తానని వెల్లడి**

సినీ పరిశ్రమలో ఎప్పటినుంచో చర్చలో ఉన్న 'వేతన అసమానత' అంశంపై నటి ప్రియమణి తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. కథానాయకులతో పోలిస్తే తనకు తక్కువ పారితోషికం లభించిన సందర్భాలు ఉన్నప్పటికీ, తాను డబ్బు కంటే పాత్రలకే ఎక్కువ విలువ ఇస్తానని ఆమె స్పష్టం చేశారు. దక్షిణాది, ఉత్తరాది భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియమణి తాజా ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నిజం చెప్పాలంటే, నా కెరీర్‌లో చాలాసార్లు నా సహనటుల కంటే తక్కువ పారితోషికం తీసుకున్నాను. కానీ ఈ విషయం నన్ను ఎప్పుడూ బాధపెట్టలేదు. ఎందుకంటే నేను డబ్బు కోసం సినిమాలు చేయను. నాకు పాత్ర నచ్చితే, అది ఎంత చిన్నదైనా సంతోషంగా ఒప్పుకుంటాను. సాధారణంగా స్టార్‌డమ్‌ను బట్టి పారితోషికం నిర్ణయిస్తారు, దాన్ని నేను గౌరవిస్తాను. అయితే ఒక పాత్రకు నేను అర్హురాలినని నాకు అనిపించినప్పుడు మాత్రం కచ్చితంగా డిమాండ్ చేస్తాను. కానీ అనవసరంగా రెమ్యూనరేషన్ పెంచమని అడగను. నటన వల్లే ప్రేక్షకులు మనల్ని గుర్తుంచుకుంటారు కానీ, మన పారితోషికం వల్ల కాదు" అని ప్రియమణి వివరించారు. ఇదే ఇంటర్వ్యూలో, దక్షిణాది, ఉత్తరాది పరిశ్రమల్లో పని విధానంలో ఉన్న తేడాల గురించి కూడా ఆమె ఆసక్తికరంగా మాట్లాడారు. "సౌత్‌లో ఉదయం 8 గంటలకు షూటింగ్ అంటే, సరిగ్గా ఆ సమయానికే మొదలవుతుంది. కానీ నార్త్‌లో మాత్రం ఆ సమయానికి నటీనటులు ఇంటి నుంచి బయల్దేరుతారు. వర్క్ డిసిప్లిన్‌లో ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రియమణి కెరీర్ పరంగా బిజీగా ఉన్నారు. ఇటీవలే 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ', 'ది గుడ్ వైఫ్' వంటి వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకులను పలకరించిన ఆమె, త్వరలో తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న భారీ చిత్రం 'జన నాయగన్'లో ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339